మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 13-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 14 Issue: 14

13 జూలై 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:53 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి చతుర్దశి సా. 6:50 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఆరుద్ర రా. 2:49o వరకు తరువాత పునర్వసు యోగం ధ్రువ మ. 3:57 వరకు కరణం విష్టి ఉ. 8:40 వరకు శకుని సా. 6:50 వరకు వర్జ్యం మ. 1:05 నుండి మ. 2:30 వరకు దుర్ముహూర్తం మ. 12:47 నుండి మ. 1:39 వరకు మ. 3:23 నుండి సా. 4:14 వరకు రాహుకాలం ఉ. 7:30 నుండి ఉ. 9:07 వరకు యమగండం ఉ. 10:44 నుండి మ. 12:21 వరకు గుళికాకాలం మ. 1:59 నుండి మ. 3:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:17 నుండి తె. 5:05 వరకు అమృత ఘడియలు సా. 6:01 నుండి రా. 7:26 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

హర్ముజ్ బంద్: ఇరాన్

తమ దేశ దక్షిణ ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్, ఖతార్, ఒమన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతటితో ఆగకుండా హర్ముజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది.

టెహ్రాన్: తమ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ ద్వారా ఐఆర్జీసీ ఈ వివరాలు వెల్లడించింది. తమ దక్షిణ తీరప్రాంతాల్లోని పలు సైనిక స్థావరాలు, కమ్యూనికేషన్ టవర్లపై యూఎస్ వైమానిక దాడులు చేసిందని పేర్కొంది. దీనికి ప్రతీకారంగా మూడు దశల్లో దాడులు చేశామని తెలిపింది. మొదటి దశలో జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని, అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, తరువాయి 2 వ పేజీలో...

కాదు.. ఓపెనే

అమెరికా సెంట్రల్ కమాండ్

వాషింగ్టన్: హర్ముజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించిన వేళ అమెరికా మరోసారి స్పందించింది. అంతర్జాతీయ జలమార్గంలో చట్టబద్ధంగా ప్రయాణం కొన సాగించే నౌకల కోసం ఈ జలసంధి తెరిచే ఉందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాన్ బెదిరింపులు, ఏకపక్ష ప్రకటనలు చేస్తున్నప్పటికీ.. నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించేందుకు వీలుగా అమెరికా బలగాలు మోహరించి, సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. తమ బలగాల పర్యవేక్షణలో కాకుండా ఏ విదేశీ నౌకా జలసంధి నుంచి ప్రయాణించలేవని ఐఆర్‌జీసీ చేస్తున్న వాదన తప్పని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. హర్ముజ్‌ను ఇరాన్ నియంత్రించ లేదని, రాకపోకలు సాగుతున్నాయని స్పష్టం చేసింది. గత ఏడు తరువాయి 2 వ పేజీలో...

సముద్ర రవాణా బంద్: ఖతార్

దోహా/మస్కట్: హోర్ముజ్ జలసంధి చుట్టూ హైటెన్షన్ నెలకొనడంతో ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకుని ఖతార్ ప్రభుత్వం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. తమ పరిధిలోని సముద్ర కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని వాణిజ్య నౌకల యాజమాన్యాలను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వాణిజ్య నౌకలు, తరువాయి 2 వ పేజీలో...

రేవంత్ రక్త పిశాచి

నీళ్లడిగితే నెత్తురు చల్లుతా అంటావా?

కాంగ్రెస్‌కు ఇంకా రక్తదాహం తీరలేదా?.. 60 ఏళ్లుగా తెలంగాణ నెత్తురు తాగారు

తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు.. కాంగ్రెస్ పార్టీ.. నరహంతకుల పార్టీ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి సీఎం రేవంత్ చేసిన ఘాటు వ్యాఖ్యలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి రక్త పిశాచిగా మారిపోయాడంటూ సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ నేతల రక్తాన్ని పంటలపై చల్లుతానంటూ ముఖ్యమంత్రి అనడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అంటావా? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు ఇంకా రక్తదాహం తీరలేదా అని నిలదీశారు.

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు):ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంతాన్ని పీడించి ఇక్కడి ప్రజల నెత్తురు తాగింది చాలదా అని ఆక్రోశం వెళ్లగక్కారు. తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు లాంటి కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలో చెప్పాలని కేటీఆర్ సవాల్ విసిరారు. గత చరిత్రను గుర్తుచేస్తూ కాంగ్రెస్ పార్టీని నరహంతకుల పార్టీగా కేటీఆర్ అభివర్ణించారు. తెలంగాణ బిడ్డలను ఎన్‌కౌంటర్ల పేరుతో పిట్టలను కాల్చినట్టు కాల్చిపారేసి నెత్తుటేళ్లు పారించిన చరిత్ర మీదేనని ఆయన మండిపడ్డారు. గతంలో జరిగిన పలు ఉద్యమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును కేటీఆర్ తీవ్రంగా ఎండగట్టారు. 1952 నాటి ముల్కీ ఉద్యమంలో ఏడుగురు అమాయకులను కాల్చి చంపిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పాలకులు 369 మంది విద్యార్థులు, యువకులపై తూటాలు కురిపించారని ఆరోపించారు. వందలాది మంది ప్రాణాలు తీసి నెత్తురు పారించిన ఖూనీకోర్లు మీరేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మలిదశ తరువాయి 2 వ పేజీలో...

నీకూ హిట్లర్‌కు పట్టిన గతే

నీళ్లు అడిగితే సైకో మాటలా?.. కన్నెపల్లిపై అవగాహనలేని సీఎం

రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పినా సోయిరాలే.. రేవంత్‌పై మాజీమంత్రి హరీశ్ రావు ఫైర్

వృధాగా పోతున్న గోదావరి నీళ్లను పొలాలకు పారించమని అడిగితే సీఎం రేవంత్ రెడ్డి మా రక్తం పారిస్తా అంటూ సైకో భాషా మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ మాజీ మంత్రి టి.హరీశ్ రావు విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి మా రక్తం అవసరమైతే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని. హిట్లర్ ఆదర్శం అని చెప్పుకున్న రేవంత్ రెడ్డి హిట్లర్ తరహా హంతక భాష మాట్లాడుతున్నాడని..ఆయనకు హిట్లర్ కు పట్టిన గతే పడుతుందన్నారు.

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): మేడిగడ్డ గేట్లు మూసివేయకుండా కన్నెపల్లి పంప్ హౌస్ మోటర్లు ఎలా ఆన్ చేస్తారు అని రేవంత్ రెడ్డి అంటున్నాడని, మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ మోటర్లు ఆన్ చేయవచ్చు అనే కనీస అవగాహన ముఖ్యమంత్రికి లేకపోవడం దౌర్భాగ్యం అన్నారు. రిటైర్డ్ ఇంజనీర్లు ఈ విషయం చెప్పిన తర్వాత కూడా రేవంత్ రెడ్డికి సోయి రాలేదు అని విమర్శించారు. రైతుల కోసం రక్తం ఇవ్వడానికి,జైలుకి వెళ్లడానికి మేము సిద్ధమే.. కానీ రైతులకు నీళ్లు ఇవ్వాలని, నీ నోరు నీ ఇష్టం అని, కానీ నీళ్లు తెలంగాణవి.. నీళ్ల అంశంలో ఇష్టమొచ్చినట్టు చేస్తానంటే కుదరదని రేవంత్ రెడ్డికి హరీశ్ రావు హితవు పలికారు. కన్నెపల్లి మోటార్ ఆన్ చేయమని చెప్తే.. ప్రతిపక్షాల కంఠం నొక్కుతా...కోస్తా, రక్తం పారిస్తా అనడం, రిటైర్డ్ ఇంజనీర్లు మాట్లాడితే జైల్లో పెడతా అనడం, ప్రస్తుతం ఉన్న ఇంజనీర్లు ప్రశ్నిస్తే బదిలీలు చేస్తూ ఏసీబీ దాడులు చేయించడం.. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కరెక్ట్ పద్ధతి కాదు అని హరీశ్ రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి లాగా కాకుండా ఒక సైకో లాగా మాట్లాడుతున్నాడన్నారు. మేడిగడ్డ వద్ద రూ.8.5 కోట్ల ఖర్చుతో చిన్న కాపర్ డ్యామ్ కట్టి.. నీళ్లు ఎల్లంపల్లికి తీసుకెళ్లొచ్చని తెలంగాణ నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఇంజనీర్ల తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,482
వెండి (కిలో):	రూ.2,45,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,997

విశ్వవాణి



మోకాళ్ల ఆస్టియోఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్న రోగులకు శస్త్రచికిత్స అవసరం లేకుండానే గణనీయమైన ఉపశమనం కలిగించే కొత్త చికిత్స విధానాన్ని జర్మనీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. చారిటే యూనివర్సిటేట్స్‌మెడిజిన్ బెర్లిన్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో, ఈ చికిత్స పొందిన రోగుల్లో 12 నెలల్లో మోకాళ్ల నొప్పి దాదాపు సగానికి తగ్గినట్లు వెల్లడైంది. జెనిక్యులర్ ఆర్టరీ ఎంబోలైజేషన్ చికిత్సను మలింత మెరుగుపరిచి, మోకాలి వద్ద అసాధారణంగా పెరిగిన రక్తనాళాలు, వాటికి అనుసంధానమైన నొప్పిని గుర్తించే నరాలను లక్ష్యంగా చేసుకుని చికిత్స అందిస్తారు. దీనివల్ల వాపు తగ్గి నొప్పి కూడా గణనీయంగా తగ్గుతుందని పరిశోధకులు తెలిపారు.

నేడు టీజీ-టెట్ ఫలితాలు విడుదల

మధ్యాహ్నం 2.30 గంటలకు రిలీజ్

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ-టెట్) రాసిన అభ్యర్థులకు విద్యాశాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. సోమవారం మధ్యాహ్నం 02:30 గంటలకు టెట్ ఫలితాలను అధికారికంగా విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఫలితాలు విడుదలైన వెంటనే అభ్యర్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా సులభంగా మార్కులను చూసుకోవచ్చు. అభ్యర్థుల సౌకర్యార్థం విద్యాశాఖ ప్రత్యేకంగా అధికారిక పోర్టలు అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్ -2 వ పేజీలో...

ప్రజలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం

కాళేశ్వరాన్ని కోమాలోకి నెట్టారు.. కేంద్రమంత్రి బండి సంజయ్ ధ్వజం

'తెలంగాణ ప్రజలకు రెండు పార్టీల నేతలు రక్తకన్నీరు సినిమా చూపిస్తున్నారు. కాంగ్రెస్ డైరెక్షన్..బీఆర్ఎస్ యాక్షన్ మూవీ రక్తకన్నీరు-2 ను తలపిస్తోంది. 'రక్త కన్నీరు' నాగభూషణంను మించి నటనలో జీవిస్తున్నారు' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ కాళేశ్వరాన్ని కూల్చి రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని నీళ్ల పాల్జేసిందన్నారు.

కరీంనగర్, జూలై 12 (ఈవార్తలు): ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ సర్కార్ కాళేశ్వరాన్ని కోమాలోకి నెట్టిందన్నారు. ఈ రెండు పార్టీల పాపాలకు తెలంగాణ రైతులే బలవుతున్నారని, కాంగ్రెస్ చేతకానితనాన్ని ఎన్డీఎస్ఏపై నెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం... బ్యారేజీల యజమాని తెలంగాణ ప్రభుత్వమేనని తెలిపారు. ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ కమిటీలు సలహాలు మాత్రమే ఇస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. బ్యారేజీ మరమ్మతు పనులు చేయాల్సింది.. బాధ్యత వహించాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇప్పటికే 3 సార్లు నివేదిక ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? పునరుద్ధరణ చర్యలు తరువాయి 2 వ పేజీలో...

జానకమ్మకు కన్నీటి వీడ్కోలు

కడసారి చూపుకు కదిలి వచ్చిన అభిమానులు

మైసూర్: గుండెపోటుతో కన్నుమూసిన ప్రముఖ గాయని జానకి(88)ని కడసారి దర్శించుకుని కన్నీటి వీడ్కోలు పలికేందుకు అభిమాన జనం భారీగా కదిలారు. గాన కోకిల జానకి పార్థివ దేహాన్ని అభిమానుల సందర్శనార్థం మైసూర్ లోని మహారాజ కాలేజీ గ్రౌండ్స్ కు తీసుకొచ్చారు. సాయంత్రం 4గంటల వరకు ఇక్కడే ఉంచారు. తమ అభిమాన గాయని కడసారి చూపుకోసం అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆమెకు అశ్రునివాళి అర్పించారు. ఆరు దశాబ్దాలకు పైగా తన మధురమైన గాత్రంతో 50 వేలకు పైగా పాటలు పాడిన "గాన కోకిల" కడసారి చూపు కోసం అభిమానులు, సినీ ప్రముఖులు భారీగా తరలివచ్చారు. జానకి అంత్యక్రియలను కణియర హుండి గ్రామంలోని ఫామ్ హౌస్ లో సాయంత్రం 5గంటలకు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. జానకి మృతి పట్ల సినీ, రాజకీయ రంగ ప్రముఖులు తమ సంతాపాన్ని తెలిపారు.

టీజీ20 లీగ్ ఛాంపియన్ ఈ-హైదరాబాద్

రాణించిన యశ్వీర్ గౌడ్, దేవ్, అజయ్ అభిరథ్ రెడ్డి కెప్టెన్ ఇన్నింగ్స్

ఖమ్మం, జూలై 12 (ఈవార్తలు): టీజీ20 లీగ్ ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం ఏసెస్‌పై హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు ఘన విజయం సాధించి, టోర్నీ విజేతగా అవతరించింది. ఖమ్మం వేదికగా జరిగిన ఈ ఫైనల్ పోరులో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం ఏసెస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఖమ్మం జట్టులో మికిల్ జైస్వాల్ 65 పరుగులతో అద్భుతమైన అర్ధసెంచరీ చేసి జట్టుకు భారీ స్కోరు అందించే ప్రయత్నం చేశాడు. అతనికి తోడుగా హిమతేజ 31 పరుగులు, విద్యానంద రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

వింబుల్డన్ విజేత సిన్నర్

జ్వెరెవ్‌పై సంచలన విజయం

లండన్: ప్రపంచ నంబర్ వన్ టెన్నిస్ ఆటగాడు, ఇటలీ స్టార్ జాన్నిక్ సిన్నర్ మరోసారి లండన్ గడ్డి కోర్టుపై తన ప్రతాపం చూపించారు. ప్రతిష్టాత్మక వింబుల్డన్ ఓపెన్-2026 పురుషుల సింగిల్స్ గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను సిన్నర్ కైవసం చేసుకున్నారు. ఆదివారం రాత్రి హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ సిన్నర్.. జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై అద్భుత విజయం తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

13.7.2026

మేషం: ఈరోజు చేపట్టిన పనులు ఆశించిన దిశగా ముందుకు సాగుతాయి. ఉద్యోగంలో మీ కృషికి మంచి గుర్తింపు లభించే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో సఖ్యత నెలకొంటుంది. ముఖ్యమైన నిర్ణయాలను ఆత్మవిశ్వాసంతో తీసుకోవచ్చు.

వృషభం: వ్యాపార, ఉద్యోగ రంగాల్లో అనుకూలమైన వాతావరణం ఉంటుంది. కొత్త పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. ఆదాయానికి సంబంధించిన శుభవార్తలు వినే అవకాశం ఉంది. కుటుంబంలో ఆనందకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఆరోగ్యంపై సాధారణ శ్రద్ధ వహించడం మంచిది.

మిథునం: ఉద్యోగంలో బాధ్యతలు పెరిగినా సమర్థంగా పూర్తి చేస్తారు. అనవసర ఖర్చులను నియంత్రించడం అవసరం. సన్నిహితుల సహకారంతో కొన్ని పనులు పూర్తవుతాయి. విద్యార్థులకు చదువులో మంచి పురోగతి ఉంటుంది. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలి.

కర్కాటకం: చాలాకాలంగా ఎదురుచూస్తున్న పనుల్లో పురోగతి కనిపిస్తుంది. కుటుంబ సభ్యుల సహకారం మీకు ధైర్యాన్ని ఇస్తుంది. ఆర్థిక పరిస్థితి క్రమంగా మెరుగుపడుతుంది. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు చోటుచేసుకోవచ్చు. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

సింహం: వృత్తిపరంగా కొత్త అవకాశాలు మీ ముందుకు వస్తాయి. అధికారులతో జరిగే చర్చలు సానుకూలంగా ఉంటాయి. ఆదాయం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది. తొందరపాటు నిర్ణయాలను నివారించడం మంచిది.

కన్య: కొత్త కార్యక్రమాలను ప్రారంభించడానికి అనుకూలమైన రోజు. ఉద్యోగంలో మీ పనితీరుకు ప్రశంసలు లభించవచ్చు. ఆర్థికంగా స్థిరమైన పరిస్థితి ఉంటుంది. బంధుమిత్రులతో సత్సంబంధాలు బలపడతాయి. ఆరోగ్యపరంగా చిన్న జాగ్రత్తలు తీసుకోవాలి.

తుల: పని విషయంలో ఓర్పు, పట్టుదలతో ముందుకు సాగితే మంచి ఫలితాలను పొందుతారు. ఆర్థిక వ్యవహారాల్లో ప్రణాళికతో వ్యవహరించడం మంచిది. కుటుంబ సభ్యులతో అభిప్రాయాలను పంచుకోవడం వల్ల సమస్యలు తగ్గుతాయి. మిత్రుల సహకారం లభిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

వృశ్చికం: భాగస్వామ్య వ్యవహారాల్లో అనుకూల ఫలితాలు పొందుతారు. ఉద్యోగంలో కొత్త బాధ్యతలు వచ్చే అవకాశం ఉంది. ఆదాయం ఆశించిన స్థాయిలో ఉంటుంది. కుటుంబంలో శుభవార్తలు ఆనందాన్ని కలిగిస్తాయి. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి.

ధనస్సు: శ్రమకు తగిన ఫలితం అందుతుంది. ఉద్యోగంలో ఉన్నతాధికారుల ప్రశంసలు పొందే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితి బలపడుతుంది. కుటుంబ సభ్యుల సహకారం అన్ని విధాలుగా ఉంటుంది. ఆరోగ్యంపై కొద్దిగా శ్రద్ధ వహించాలి.

మకరం: స్థిరాస్తి సంబంధిత పనులు ముందుకు సాగుతాయి. ఉద్యోగంలో సహోద్యోగుల సహకారం లభిస్తుంది. కొత్త అవకాశాలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది. కుటుంబంలో ఆనందకరమైన వాతావరణం నెలకొంటుంది. ఖర్చుల విషయంలో జాగ్రత్త అవసరం.

కుంభం: కొత్త ఆలోచనలు కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. వ్యాపారంలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. స్నేహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు.

మీనం: అనుకున్న పనులను సమయానికి పూర్తి చేయగలుగుతారు. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు చోటుచేసుకుంటాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. బంధుమిత్రులతో సత్సంబంధాలు బలపడతాయి. ఆరోగ్యం, మానసిక ప్రశాంతత రెండూ అనుకూలంగా ఉంటాయి.

రేవంత్ రక్త పిశాచి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో వెయ్యి మందికి పైగా విద్యార్థుల బలమరణాలకు కారణమైన మృగాలు మీరేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతల చేతులు తెలంగాణ బిడ్డల రక్తంతో తడిచాయని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎండిపోతున్న పంట పొలాలకు సాగునీరు అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి తమ రక్తం ఎంత కావాలో చెబితే అంతా పంపిస్తామని ఆయన సవాల్ విసిరారు. తెలంగాణ సాధన కోసం పేగులు తెగేదాకా కొట్లాడిన చరిత్ర తమదని ఆయన స్పష్టం చేశారు. రైతాంగం ప్రయోజనాల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని ప్రకటించారు. గతంలో నీళ్లలో నిప్పులు పుట్టించి అనేక జలసాధన పోరాటాలు విజయవంతంగా చేశామని ఆయన గుర్తుచేశారు. ప్రజలకు నెత్తురు ఇస్తేనే పొలాలకు నీళ్లు ఇస్తామని ఈ కర్కశ ప్రభుత్వం కోరుతుంటే తాము వెనకాడబోమని చెప్పారు. ప్రాణాలను పణంగా పెట్టైనా సరే రైతులను ఆదుకుంటామని వెల్లడించారు. పాలకుల రక్తదాహం తీర్చుకుని, కనీసం ఎండిపోతున్న పొలాల జలదాహం తీర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులు పడుతున్న ఇబ్బందులపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యవసాయ రంగానికి సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. పంటలు ఎండిపోతుంటే క్షేత్రస్థాయిలో రైతులు కన్నీరు పెడుతున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాల్సింది పోయి విపక్షాలపై రక్తం చల్లుతామనడం ముఖ్యమంత్రి పదవికి అస్సలు తగదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసాత్మక వ్యాఖ్యలు చేయడం అత్యంత దారుణమని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే రాష్ట్రంలో అరాచక పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రైతుల సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలు మానుకుని రైతాంగాన్ని ఆదుకోవాలని రేవంత్ రెడ్డికి ఆయన హితవు పలికారు. తెలంగాణ సెంటిమెంట్‌ను, గత ఉద్యమ గాయాలను కేటీఆర్ తన విమర్శల్లో ప్రముఖంగా ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అణచివేతను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఆయన చెప్పారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేటీఆర్ తీవ్రంగా ఎండగట్టారు. నాడు నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాటం చేస్తే బుల్లెట్లతో సమాధానం చెప్పిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆరోపించారు. ఇప్పుడు స్వరాష్ట్రంలో మళ్లీ అదే తరహా అణచివేత ధోరణిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రదర్శిస్తోందని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడుతుందని, వారి హక్కుల సాధన కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్తామని కేటీఆర్ హెచ్చరించారు. పాలనలో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ నేతలు ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

నీకూ హిట్లర్‌కు పట్టిన గతే

మొదటి పేజీ తరువాయి

ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందని, ఆ లేఖ బయటపెట్టమని నేను అడిగానని, ఉన్న విషయం చెబితే రిటైర్డ్ ఇంజనీర్లను జైలులో వేస్తా అని రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్ రావు విమర్శించారు. వాళ్ళు చెప్పినట్లు మోటార్లు ఆన్ చేస్తే మీరు చెప్పిన అబద్ధాలు, దుష్ప్రచారం బైట పడుతుందని నీళ్లు ఇవ్వకుండా రేవంత్ అడ్డు పడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి 31నెలల పాలనలో బూతులు తప్ప ఏం నేర్చుకోలేదని, ప్రాజెక్టులపైన, పాలనపైన అవగాహన పెంచుకోలేదని హరీశ్ రావు ఆరోపించారు. షాబాద్ హత్య కేసు నిందితుడికి రేవంత్ రెడ్డికి తేడా లేదు అని, షాబాద్ ఘటన మీద పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాడు కానీ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం స్పందించలేదు అని తప్పుబట్టారు. ఇంత పెద్ద ఘటన జరిగితే, నిన్న మధ్యాహ్నం ఓ పోలీస్ ఉన్నతాధికారి గోల్ఫ్ ఆడాడని.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఇలా ఉందని హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ రెడ్డికి తెలి ఉంటే గోదావరి నీళ్లు పట్టిసీమకు ఎందుకు పోతాయని, తెలంగాణ ప్రాజెక్టులను పడావ్ పెట్టి ఏపీకి నీళ్లు పంపిస్తున్నావని ప్రశ్నించారు. కన్నెపల్లి, సీతారామ దగ్గర నీళ్లు ఒడిసిపడితే నీళ్లు కిందకి ఎలా పోతాయి? అని, దేవాదుల ప్రాజెక్టులో రెండు మోటర్లు ఆన్ చేసి 6 మోటర్లు ఎందుకు బంద్ పెట్టినవ్ ? అని నిలదీశారు. నీ గురువుకు గురు దక్షిణ కోసం కాదా? ఇదంతా చేస్తున్నావని, దేవాదుల ప్రాజెక్టుకు వెళ్లి నీ బండారం బయటపెడతానంటూ రేవంత్ రెడ్డిని హరీశ్ రావు హెచ్చరించారు. ఎలినినో వంటి కరవు పరిస్థితుల్లో చుక్క చుక్క నీరు కూడా బంగారం కంటే విలువైనదని గుర్తు చేశారు. 'నా రాజకీయం జీవితంపై, పార్టీ మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన చిల్లర మాటలకు నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు' అని హరీశ్ రావు స్పష్టం చేశారు. 'చొక్కాలు మార్చినట్లు పార్టీలు మార్చిన నువ్వు కూడా నా గురించి మాట్లాడుతున్నావా? నా గురించి మాట్లాడే నైతికత రేవంత్ రెడ్డికి ఉందా? నా పుట్టుక బీఆర్ఎస్ పార్టీలోనే, చావు బీఆర్ఎస్ పార్టీలోనే అని ఎన్నో సార్లు చెప్పా. నేను బీజేపీలోకి వెళ్తున్నానంటూ పదేపదే గోబెల్స్ ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ కేడర్‌తో రేవంత్ రెడ్డి ఆడుతున్న మైండ్ గేమ్ రాజకీయాలు చెల్లబోవు' అని స్పష్టం చేశారు.

వింబుల్డన్ విజేత సిన్నర్

మొదటి పేజీ తరువాయి

సాధించారు. దాదాపు 3 గంటల 45 నిమిషాల పాటు సాగిన ఈ సుదీర్ఘ పోరాటంలో సిన్నర్ 6-7(7), 7-6(2), 6-3, 6-4 తేడాతో జ్వెరెవ్‌ను ఓడించి ట్రోఫీని ముద్దాడారు. మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు ఆటగాళ్లు ప్రతి పాయింట్ కోసం హోరాహోరీగా తలపడ్డారు. మొదటి సెట్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో ఆట టైబ్రేకర్ వరకు వెళ్లింది. ఉత్కంఠభరితమైన ఈ టైబ్రేకర్‌లో జ్వెరెవ్ 7-6(7)తో తొలి సెట్ గెలిచి సిన్నర్‌కు గట్టి పోటీ ఇచ్చారు. అయితే, వెంటనే పుంజుకున్న సిన్నర్ రెండో సెట్‌లో అద్భుతమైన బేస్‌లైన్ ఆటతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. ఈ సెట్ కూడా టైబ్రేకర్ వైపు వెళ్లగా, ఈసారి సిన్నర్ ఏకపక్షంగా 7-6(2)తో సెట్‌ను గెలుచుకుని మ్యాచ్‌ను సమం చేశారు. మూడో సెట్‌లో ఆట తీవ్రత మరింత పెరిగింది. ఈ క్రమంలోనే జర్మనీ స్టార్ జ్వెరెవ్‌కు మోకాలికి స్వల్ప గాయమైంది. వైద్య సహాయం తీసుకున్న అనంతరం జ్వెరెవ్ కోర్టులోకి తిరిగి వచ్చినప్పటికీ, సిన్నర్ తన దూకుడును తగ్గించలేదు. శక్తివంతమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో పట్టు బిగించి మూడో సెట్‌ను 6-3తో సులువుగా సొంతం చేసుకున్నారు. నాలుగో సెట్‌లో ఇద్దరు ఆటగాళ్లు స్కోరును 4-4తో సమం చేసే వరకు పట్టు వదల్లేదు. అయితే, కీలకమైన తొమ్మిదో గేమ్‌లో జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సిన్నర్ 5-4తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. ఆ తర్వాత తన సొంత సర్వీస్ గేమ్‌ను ఏమాత్రం తడబడకుండా గెలుచుకుని, సెట్‌ను 6-4తో ముగించి విజయకేతనం ఎగురవేశారు. ఈ విజయంతో జానిక్ సిన్నర్ తన కెరీర్‌లో 5వ గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను సాధించారు. అలాగే, ఓపెన్ ఎరాలో వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా రెండో ఏడాది నిలబెట్టుకున్న 10వ ఆటగాడిగా చరిత్ర పుటల్లోకెక్కారు. రన్నరప్‌గా నిలిచిన అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు ఈసారి కూడా గ్రాండ్ స్లామ్ కల చేజారినట్లయింది.

నేడు టీజీ-టెట్ ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

సహాయంతో అధికారిక వెబ్సైట్‌లో లాగిన్ అయి ఫలితాలను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 115,028 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఓసీ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు సాధించాలి. అంటే 150 మార్కులకు గానూ 90 మార్కులు రావలసి ఉంటుంది. బీసీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. అంటే 75 మార్కులు వస్తేనే అర్హత సాధించినట్లు ప్రకటిస్తారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు: కనీసం 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. అంటే 150 మార్కులకు గానూ 60 మార్కులు సాధిస్తే సరిపోతుంది. టెట్‌లో సాధించిన మార్కులకు ఉపాధ్యాయ నియామకాల్లో 20 శాతం వెయిటేజీ ఉంటుంది. ఉపాధ్యాయ ఉద్యోగమే లక్ష్యంగా ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు టెట్ మార్కులు అత్యంత కీలకం. ఈ టైటిల్‌లో సాధించిన మార్కులకు రాబోయే ఉపాధ్యాయ నియామకాల్లో 20 శాతం వెయిటేజీ ఉంటుంది.

ప్రజలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం

మొదటి పేజీ తరువాయి

చేపట్టాలని పదే పదే చెప్పినా ఎందుకు పెడచెవిన పెడుతున్నారు? అని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ చేతగానితనాన్ని కేంద్రంపై నెట్టడం అలవాటుగా మారిందన్నారు. 'కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, బాధ్యులను జైల్లో వేస్తామని గతంలో ప్రకటించింది కాంగ్రెస్సే. అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరపకుండా రూ.9 వేల కోట్ల అవినీతిపై విచారణకే పరిమితమైంది నిజం కాదా? ఆ కేసులో సూత్రధారులను అరెస్ట్ చేసి జైల్లో వేయకుండా సీబీఐ దర్యాప్తు చేయాలంటూ కేంద్రంపై రుద్ది తప్పుకున్నది నిజం కాదా? కాళేశ్వరంపై విజిలెన్స్ నివేదిక ఇస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అసలు విజిలెన్స్ నివేదికను బయట పెట్టే దమ్ముందా? బీఆర్ఎస్ పాపాలను రేవంత్ రెడ్డి మోయడం వెనుక మతలబు ఏమిటి? తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.. అని నిలదీశారు. కాళేశ్వరం మరమ్మతుల విషయంలోనూ రెండున్నరేళ్లు జాప్యం చేసింది మీరు కదా? ప్రజల నుంచి ఒత్తిడి వస్తుంటే చర్చను దారి మళ్లించేందుకు ఎన్డీఎస్ఏ కు అప్పగిస్తామంటూ కేంద్రంపై నెట్టాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి, నిర్లక్ష్యం, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల గోదావరి జలాలను తెలంగాణ ప్రజలు వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రాజకీయ డ్రామాలు పక్కనపెట్టండి.. ఎన్డీఎస్ఏ సిఫార్సులను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణను వేగవంతం చేయండి లేనిపక్షంలో తెలంగాణ రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ బలికాక తప్పదు' అని కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్ అయ్యారు.

టీజీ20 లీగ్ ఛాంపియన్ ఈ-హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

20 పరుగులు (నాటౌట్), ప్రతీక్ రెడ్డి 15 పరుగులు చేసి రాణించారు. అయితే హైదరాబాద్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఖమ్మం జట్టు భారీ స్కోరు చేయలేకపోయింది. హైదరాబాద్ బౌలర్లలో యశ్వీర్ గౌడ్ అత్యుత్తమంగా రాణించి 3 వికెట్లు పడగొట్టగా, దేవ్ మెహతా, అజయ్ గౌడ్ చెరో 2 వికెట్లు, అఖిల్ రాథోడ్ ఒక వికెట్ తీసి ఖమ్మం రన్‌రేట్‌ను నియంత్రించారు. అనంతరం 158 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు కేవలం 17.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. హైదరాబాద్ జట్టుకు కెప్టెన్ అభిరథ్‌రెడ్డి 48 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి మరోసారి జట్టును ముందుండి నడిపించాడు. ఆ తర్వాత షణ్ముఖ అశ్విన్ 36 పరుగులతో రాణించగా, చివర్లో వైష్ణవ్‌రెడ్డి 41 పరుగులు, ప్రణవ్ వర్మ 19 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. వీరిద్దరూ అద్భుతమైన భాగస్వామ్యంతో మ్యాచ్‌ను మరో 14 బంతులు మిగిలి ఉండగానే ముగించారు. ఖమ్మం బౌలర్లలో హర్షిత్ సాయి, విద్యానందరెడ్డి, వేద్‌రెడ్డి, షేక్ అజర్ తలో వికెట్ తీసినప్పటికీ, హైదరాబాద్ బ్యాటర్లను అడ్డుకోవడంలో వారు విఫలమయ్యారు. 6 వికెట్ల తేడాతో గెలుపొందిన హైదరాబాద్.. ట్రోఫీని దక్కించుకుంది.

సముద్ర రవాణా బంద్

మొదటి పేజీ తరువాయి

విహార నౌకలతో పాటు సాధారణ చేపల వేట బోట్లను కూడా రేవులకే పరిమితం చేయాలని స్పష్టం చేసింది. ఆదివారం ఉదయం ఖతార్ రాజధాని దోహా లక్ష్యంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే ఖతార్ ఎయిర్ డిఫెన్స్ (రక్షణ) వ్యవస్థ సకాలంలో స్పందించి వాటిలో కొన్నింటిని గగనతలంలోనే కూల్చివేసినట్లు సమాచారం. ఈ క్షిపణి శకలాలు పడటం వల్ల కొందరు పౌరులకు తీవ్ర గాయాలైనట్లు అక్కడి స్థానిక మీడియా వెల్లడించింది. ఈ దాడుల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా, శత్రువులను సమర్థంగా తిప్పికొట్టేందుకు తమ సైనిక సేనలు పూర్తి సన్నద్ధంగా ఉన్నాయని ఖతార్ ప్రభుత్వం ప్రకటించింది.

హర్మూజ్ బంద్: ఇరాన్

మొదటి పేజీ తరువాయి

ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ల హ్యాంగర్‌ను ధ్వంసం చేశామని వివరించింది. రెండో దశలో ఖతార్‌లోని అల్ ఉదెయిద్ ఎయిర్‌బేస్‌పై దాడి చేసి, కమాండ్ సెంటర్‌తో పాటు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ కేంద్రాలను ధ్వంసం చేశామని పేర్కొంది. మూడో దశలో ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో ఉన్న అమెరికా లాజిస్టికల్ కేంద్రాలపై భారీ దాడి చేశామని తెలిపింది. ఇరాన్ సైన్యం కూడా కువైట్, బ్రహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై కమికాజే డ్రోన్లతో దాడులు చేసిందని, రాడార్ సైట్లు, ఆయుధ డిపోలను ధ్వంసం చేసిందని వెల్లడించింది. అమెరికా మళ్లీ దాడులకు పాల్పడితే మరింత తీవ్రమైన ప్రతిచర్యలు ఉంటాయని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. అమెరికా జోక్యం ఆగే వరకు హర్మూజ్ జలసంధి మీదుగా ఏ నౌకనూ అనుమతించబోమని స్పష్టం చేసింది.

కాదు.. ఓపెనే

మొదటి పేజీ తరువాయి

రోజుల్లో 140కి పైగా నౌకలు ఇక్కడి నుంచి ప్రయాణాలు కొనసాగించాయని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయంపై మాట్లాడుతూ హర్మూజ్ తెరిచే ఉందన్నారు.

‘కాళేశ్వరం’పై కాంగ్రెస్ విఫలం

ఎన్డీఎస్ఏ సిఫార్సులను అమలు చేయలే.. సీఎం రేవంత్‌కు రాంచందర్ రావు లేఖ

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): కాళేశ్వరం మూడు బ్యారేజీల పునరుద్ధరణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ ఆలస్యంతో రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఆదివారం కాళేశ్వరం ప్రాజెక్టు అంశమై సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఎన్డీఎస్ఏ సిఫారసులను సకాలంలో అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యం చెందిందని 2024, 2025, 2026లో మూడు పూర్తి వర్కింగ్ సీజన్లు ఉన్నా పునరుద్ధరణ పనులు పూర్తి చేయలేదన్నారు. లేఖలో “200 టీఎంసీల గోదావరి నీటిని వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కోల్పోయింది. చీఫ్ ఇప్పటికే సమగ్ర పరీక్షలు, సాంకేతిక పరిశీలనలు, పునరుద్ధరణ చర్యలు సూచించినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ కేవలం సాంకేతిక మార్గదర్శకత్వానికేనని, అమలు బాధ్యత మాత్రం రాష్ట్ర ప్రభుత్వానిదే చీఫ్ కమిటీపై బాధ్యత నెట్టడం ద్వారా సీఎం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారుఅన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు తక్కువ నష్టం జరిగిందని, వాటిని ముందే పునరుద్ధరిస్తే ఉత్తర తెలంగాణకు నీరు అందేది. 20--25 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణకు తాగునీరు అందించే అవకాశం కోల్పోయింది.” అన్నారు. విజిలెన్స్ కమిటీ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని, విజిలెన్స్ నివేదికలో సూచించిన వారిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో ప్రభుత్వం హైకోర్టులో సమర్థంగా వాదించలేదు.బీఆర్ఎస్ పెద్దలను కాపాడేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. జడీ× విచారణకు కేవలం మూడు బ్యారేజీల అంశానికే పరిమితమైన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఇచ్చారన్నారు. రూ.1.30 లక్షల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తంపై విచారణకు ఎందుకు వెనుకాడుతున్నారని.. పంప్ హౌస్‌లు, కాల్వలు, టన్నెల్లు, రిజర్వాయర్లు సహా మొత్తం ప్రాజెక్టుపై జడీ× విచారణ జరగాలని రాంచందర్ రావు లేఖలో పేర్కొన్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

కేసీఆర్ వస్తే లాగులు తడుస్తయ్

రేవంత్‌ది రాక్షస మనస్తత్వం

రాష్ట్రంలో ఉన్నది హైబ్రిడ్ కాంగ్రెస్.. మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఎద్దేవా

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): మేడిగడ్డపై సీఎం మూర్ఖత్వపు ప్రచారం చేస్తున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కాళేశ్వరం ద్వారా గొప్ప అవకాశం సృష్టించారని అన్నారు. షాబాద్ సైకో ఘటనకు, సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలకు తేడా లేదని అన్నారు. రిటైర్డ్ ఇంజినీర్లను జైల్లో పెడతానని సీఎం బెదిరిస్తున్నారని.. వారు తెలంగాణవాదులుగా మాత్రమే మాట్లాడుతున్నారని చెప్పారు. వాస్తవాలు మాట్లాడితే బెల్ట్ ట్రీట్మెంట్ ఇస్తారా అని.. జైల్లో పెట్టిన వాళ్లు కాలగర్భంలో కలిశారని సూచించారు. సూపర్ ఎల్‌నినోతో మంచి నీళ్లకు ఇబ్బందులు వచ్చే పరిస్థితి వస్తుందన్నారు. బీఆర్ఎస్ నేతల రక్తాన్ని పొలాల్లో చల్లుతానని రేవంత్‌రెడ్డి అన్నారని.. కేసీఆర్ రక్తం చెమటగా మారి తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డికి తమ రక్తం కావాలంటే కేటీఆర్‌తో సహా అందరం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహుల చేతిలో ఆయుధంగా ఉన్నారని.. ఆయనది రాక్షస మనస్తత్వమని.. ఇలాంటి వ్యాఖ్యలపై ఎలాంటి కేసులు పెట్టాలో డీజీపీ ఆలోచించాలని అన్నారు. భద్రాచలం కొట్టుకుపోతుందని అజ్ఞానపు సీఎం, మంత్రి అంటున్నారని.. దీనిపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మంత్రికి ఏ మూర్ఖుడు చెప్పిండో తెలియదని.. 290 టీఎంసీల వరద వచ్చినా భద్రాచలానికి ఏం కాలేదని అన్నారు. సీఎం పదవి పిచ్చిలో పడి ఆయనకు జ్ఞాపక శక్తి తగ్గిందన్నారు. వీళ్లకు అసెంబ్లీ పెట్టే దమ్ము లేదని.. కేసీఆర్ వస్తే లాగులు తడుపుకుంటారని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని.. రాష్ట్రంలో ఉన్నది హైబ్రిడ్ కాంగ్రెస్ అని పేర్కొన్నారు.

డెడ్ స్టోరేజీలోకి పోచారం ప్రాజెక్ట్

ఎల్లారెడ్డి, జూలై 12 (ఈవార్తలు): నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాలకు జీవనాడిగా ఉన్న పోచారం ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీలోకి చేరింది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులోకి చుక్క నీరూ రాలేదు. దీంతో వేసవి ముగియక ముందే నీటిమట్టం తీవ్రంగా పడిపోయి ఖరీఫ్ సాగుపై అనిశ్చితి నెలకొంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1.82 టీఎంసీలు. ప్రస్తుతం డెడ్ స్టోరేజీ స్థాయి కంటే తక్కువగా కేవలం 0.103 టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ అక్షయ్ తెలిపారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరగడంతో నీటిమట్టం మరింత తగ్గుతోంది. నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాల పరిధిలో 10,500 ఎకరాల ఆయకట్టుకు పోచారం ప్రాజెక్ట్ నుంచే ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందుతుంది. రబీలో మాత్రం ఒక ఏడాది ఏ జోన్‌కు నాగిరెడ్డిపేట్, మరో ఏడాది బీ జోన్‌కు ఎల్లారెడ్డికి నీరిస్తారు. గత సంవత్సరం జూన్ నుంచే భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. ఆగస్టు 15 నాటికే పోచారం ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటితో పొంగిపొర్లింది. జూన్ రెండో వారంలోనే ఆయకట్టులో వరి నాట్లు పూర్తయ్యాయి. అయితే ఈసారి వానాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా భారీ వర్షాలు కురవలేదు. నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉండటం, జూలై--ఆగస్టులో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం ఉంటుందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించడం రైతుల ఆందోళనను రెట్టింపు చేస్తోంది. ఖరీఫ్ సాగు కోసం ఆయకట్టు రైతులు ఇప్పటికే భూములను దుక్కి దున్ని, వరి నారుమడులు వేసి సిద్ధంగా ఉన్నారు. బోరు బావులున్న రైతులు కొంతమేర నాట్లు వేస్తున్నా, ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు మాత్రం వర్షం కోసం ఆగాల్సిన పరిస్థితి. “వరుణదేవుడు ఎప్పుడు కరుణిస్తాడో, వర్షాలు ఎప్పుడు కురుస్తాయో” అంటూ ప్రతిరోజూ ఆకాశం వైపు చూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పవన్ రెండో భుజానికీ సమస్య: చంద్రబాబు

ముంబై, జూలై 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆదివారం ఆయన ముంబై వెళ్లి ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆరోగ్య పరిస్థితిని, వైద్యుల సూచనలను వివరించారు. పవన్ కల్యాణ్ ఎప్పుడూ ప్రజల సేవలోనే ఉంటారని, వారి మధ్యకు వెళ్లినప్పుడు తనను తాను మరిచిపోతారని చంద్రబాబు అన్నారు. “పవన్ ఎక్కడికి వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం వస్తారు. ఆ సమయంలో తోపులాట, ఒత్తిడి సర్వసాధారణం. ఈ ఒత్తిడి కారణంగానే ఆయన భుజానికి సమస్య వచ్చింది. ఇది ఈరోజు వచ్చింది కాదు, చాలా కాలంగా ఈ నొప్పితో బాధపడుతున్నారు. చివరకు ఇక్కడికి వచ్చి అత్యుత్తమ వైద్యుల చేత ఆపరేషన్ చేయించుకున్నారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ ఆపరేషన్ జరిగింది” అని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం పవన్ వేగంగా కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యవంతులవుతారనే విశ్వాసం ఉందని చెప్పారు. వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్‌కు మూడు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆ తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. “పవన్ రెండో భుజానికి కూడా కొంచెం సమస్య ఉంది. దానికి ప్రస్తుతానికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచించారు. ఆరు నెలల తర్వాత పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే తదుపరి చర్యలు తీసుకుంటారు” అని చంద్రబాబు వెల్లడించారు.

రేపు విశాఖకు జగన్

గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు పరామర్శ

వైజాగ్, జూలై 12 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు. ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు. జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

షాబాద్ హంతకుడు ఎక్కడ?

ఆచూకీపై వీడని సస్పెన్స్!.. 10 ప్రత్యేక బృందాలతో గాలింపు

షాబాద్ ఎస్సై సస్పెన్షన్

రంగారెడ్డి, జూలై 12 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా షాబాద్‌ను ఉలిక్కిపడేలా చేసిన ఆరుగురి వరుస హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ, పక్కా ప్రణాళికతోనే రైలెక్కి పారిపోయాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని పట్టుకునేందుకు సుమారు 10 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి, గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఘోర హత్యాకాండకు పాల్పడిన తర్వాత రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసి చనిపోతానని చెప్పడంతో అతను ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని మొదట భావించారు. అయితే, నందిగామ సమీపంలో నిందితుడి కారును, మొబైల్ సిగ్నల్‌ను పోలీసులు గుర్తించారు. అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా, అతను కారును వదిలేసి నందిగామ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు స్పష్టమైంది. దీంతో రైల్వే స్టేషన్‌లోని దృశ్యాలను విశ్లేషిస్తున్న పోలీసులు, అతను ఆత్మహత్య చేసుకోలేదని, తప్పించుకునేందుకే రైలు మార్గాన్ని ఎంచుకున్నాడని తేల్చారు. ఈ దారుణానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. గతంలో ఓ మైనర్ బాలికను వేధించిన కేసులో పోక్సో చట్టం కింద అరెస్టయిన రాజ్‌కుమార్, జైలు నుంచి విడుదలయ్యాక కక్ష పెంచుకున్నాడు. ‘మీ అంతు చూస్తా’ అంటూ బాధితుల కుటుంబాన్ని బెదిరించాడు. ఈ విషయంపై వారు స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కన్నీరుమున్నీరవుతున్నారు. “అతడే భయపడుతున్నాడు. మీరేం కంగారు పడొద్దు” అని కేసు దర్యాప్తు అధికారి అయిన ఎస్సై రమేశ్ తేలిగ్గా తీసిపారేసినట్లు బాధితులు వాపోతున్నారు. వారి ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించని కారణంగానే శనివారం ఈ ఘోరం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు మొదట బాలిక, ఆమె తల్లి, నానమ్మను దారుణంగా నరికి చంపి, ఆ తర్వాత తన భార్య, ఇద్దరు పిల్లలను కూడా హతమార్చాడు. ఈ ఆరోపణల నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు షాబాద్ ఎస్సై రమేశ్‌ను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తక్షణమే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నిందితుడు ఏ రైలు ఎక్కాడు, ఎక్కడికి పారిపోయాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



విశాఖలో స్వల్ప భూకంపం

ఉలిక్కిపడిన నగరవాసులు

రిక్టర్ స్కేలుపై 4 – 4.5గా నమోదు

వైజాగ్, జూలై 12 (ఈవార్తలు): విశాఖపట్నం నగరంలో సంభవించిన భూప్రకంపనలు తీవ్ర కలకలం సృష్టించాయి. ఆదివారం తెల్లవారుజామున స్వల్పంగా భూమి కంపించడంతో గాఢ నిద్రలో ఉన్న నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీయడంతో పలు ప్రాంతాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ఈ ప్రకంపనల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని సాగర్ నగర్, తాటిచెట్లపాలెం, సీతమ్మధార, మాధవధార, పెద వాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 4.0 నుంచి 4.5గా నమోదైంది. బంగాళాఖాతంలో పది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు.

అక్రమంగా తరలిస్తున్న 23 గోవుల పట్టివేత

తొర్రూరు, జూలై 12 (ఈవార్తలు): అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, 23 గోవులతో పాటు ఒక గేదెను ఆదివారం పట్టుకుని బాటసింగారం గోశాలకు తరలించినట్లు ఎస్ఐ యుగంధర్ గౌడ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా కంటైనర్ వాహనంలో గోవులను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు, అనుమానంతో వలిగొండ--తొర్రూరు చౌరస్తా వద్ద అశోక్ లేలాండ్ కంటైనర్ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 23 గోవులు, ఒక గేదె ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని సీజ్ చేశారు. విచారణలో, గోవులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా గురజాల నుంచి మేదక్ జిల్లా చేర్యాల మార్కెట్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

VANGS
GLOBAL TECHNOLOGIES LLP

POWERING NEWS DIGITALLY

Smart CMS & Digital Solutions
for Modern News Businesses

1 News Paper CMS

Manage, publish & distribute newspapers efficiently with our powerful CMS.

2 News Website CMS

Create dynamic, fast & SEO-friendly news websites with ease.

3 Mobile App Development

Engage your audience on the go with feature-rich news mobile apps.

Fast & Reliable | Secure & Scalable | Responsive Design | Easy to Use & Manage

VANGS GLOBAL TECHNOLOGIES
Contact: **+91 76750 87378**

News Paper CMS | News Website CMS | Mobile App Development

తన్మయ్‌నిహాల్, మాన్వితకు రాష్ట్రటైటిళ్లు

ఉత్కంఠ పోరులతో ముగిసిన తెలంగాణ అండర్-17 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ అంతర్జాతీయ షటిలర్లు, ప్రముఖులు

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): యోనెక్స్-సన్‌రైజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ (అండర్-17) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఆదివారం ఉత్కంఠభరిత పోరులతో ముగిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి పాల్గొన్న యువ షటిలర్లు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించారు. ఫైనల్ పోటీలు ప్రేక్షకులను అలరించగా విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. బహుమతి ప్రదానోత్సవానికి మాజీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సుమిత్ రెడ్డి, మాజీ అంతర్జాతీయ షటిలర్ చేతన్ ఆనంద్, మాజీ అంతర్జాతీయ క్రీడాకారిణి శారద, రంగారెడ్డి బ్యాట్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్లహౌ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో బ్యాడ్మింటన్ క్రీడ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇలాంటి రాష్ట్రస్థాయి టోర్నీలు యువ క్రీడాకారుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువ షటిలర్లకు సూచించారు. బాలుర సింగిల్స్ ఫైనల్లో కరీంనగర్‌కు చెందిన తన్మయ్‌నిహాల్ ఉత్తమ్ విజేతగా నిలవగా, బాలికల సింగిల్స్ లో హైదరాబాద్‌కు చెందిన బాలా మాన్విత రెడ్డి అల్లం టైటిల్‌ను కైవసం చేసుకుంది. బాలుర డబుల్స్ లో తనీష్ రెడ్డి --తన్మయ్ నిహాల్ ఉత్తమ్, బాలికల డబుల్స్ శృతి యెచ్చిన--శ్రీ దీత్యా సేరన్ గురజాడ, మిక్స్‌డ్ డబుల్స్ లో అక్షత్ రెడ్డి బెంజారం--శ్రీ దేవిక ఆదిశ్య హెచ్.ఎం. జోడీలు విజేతలుగా నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవానికి మాజీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సుమిత్ రెడ్డి, మాజీ అంతర్జాతీయ షటిలర్ చేతన్ ఆనంద్, మాజీ అంతర్జాతీయ క్రీడాకారిణి శారద, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ఇటీవల ప్రవేశపెట్టిన 15 పాయింట్ల విధానం క్రీడాకారులకు ఎంతో విలువైన సమయాన్ని ఆదా చేసేలా ఉంటుందని తెలిపారు. కొత్త విధానంలో ప్రతి పాయింట్ ఎంతో కీలకమైనదని, అందువల్ల ఆటగాళ్లు అనవసర ఒత్తిడికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండి ప్రణాళికాబద్ధంగా సాధన కొనసాగించాలని సూచించారు. ప్రతిరోజూ క్రమశిక్షణతో సాధన చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన యువ షటిలర్లకు ఇలాంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

మల్యాలలో స్టీల్ బ్యాంక్ ప్రారంభం

పేపర్ ప్లేట్లకు బదులుగా స్టీల్ పాత్రల వినియోగం

మల్యాల, జూలై 12 (ఈవార్తలు): పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత గ్రామాల నిర్మాణం లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మల్యాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 'మల్యాల స్టీల్ బ్యాంక్'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా వివాహాలు, శుభకార్యాలు, సామాజిక వేడుకల్లో ఒకసారి మాత్రమే ఉపయోగించి పారేసే పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర డిస్పోజబుల్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, పాత్రలను ఉపయోగించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. స్టీల్ పాత్రల వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడంతో పాటు చెట్ల నరికివేతకు కూడా అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. వాడి పారేసే ప్లేట్ల వల్ల పేరుకుపోతున్న వ్యర్థాలను తగ్గించేందుకు ఈ స్టీల్ బ్యాంక్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అవసరమైన కుటుంబాలు, సంఘాలు, గ్రామస్థులు తమ శుభకార్యాల కోసం స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్టీల్ బ్యాంక్ నుంచి తీసుకుని వినియోగించుకోవచ్చని తెలిపారు.

మల్యాలలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రీ గురుపూజోత్సవం

మల్యాల: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మల్యాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మల్యాల కేంద్రంలో శ్రీ గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ సంప్రదాయం ప్రకారం భగవద్ధ్వజాన్ని గురువుగా స్వీకరించి, దేశ సేవ, సమాజ శ్రేయస్సు, సనాతన సంస్కృతి పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని స్వయంసేవకులు సంకల్పం చేశారు. సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్య వక్త భీమనాతిని శంకర్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, జాతీయత, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. ఉదయం ప్రారంభమైన కార్యక్రమంలో భగవద్ధ్వజానికి పూజలు నిర్వహించి, స్వయంసేవకులు గురుదక్షిణ సమర్పించారు. అనంతరం దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా"ఆగంతపు నరేష్, ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు, యువకులు, స్థానిక ప్రజల, ప్రజ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సేవ కార్యక్రమంగా జన్మదిన వేడుకలు

సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ గొప్ప మనసు

వేములవాడ అర్బన్, జూలై 12 (ఈవార్తలు): సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వేములవాడలో మాజీ కౌన్సిలర్ మారం కుమార్, చిన్నారి గగన (భీవండీ) పుట్టినరోజు సందర్భంగా అన్నప్రసాదం, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు, రాజన్న ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులు, అన్నార్తులు, యాచకులు, అవసరమైన పలువురికి ప్రేమతో అన్నప్రసాదం అందజేసి మానవత్వాన్ని చాటారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎద్దండి రాజు మాట్లాడుతూ, ప్రతి శుభ సందర్భాన్ని సేవా కార్యక్రమంగా మార్చుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడేలా చేయాలనే ఉద్దేశంతో ట్రస్ట్ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు, కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దూలం భూమేష్ గౌడ్,నవీన్ పటేల్, మల్కాపురం ప్రశాంత్, హరి ప్రసాద్, నందగిరి సత్యం, మోత్కుపల్లి శ్రీనివాస్, నవీన్, వేముల సతీష్తో పాటు సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

భీమన్న గుడిలో భక్తుల రద్దీ

ఏర్పాట్లను పరిశీలించిన ఈవో రమాదేవి

వేములవాడ అర్బన్, జూలై 12 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మరియు అనుబంధ దేవాలయం అయిన బద్దిపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి క్షేత్రస్థాయిలో ఆలయంలోని పలు విభాగాలను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని టెంకాయలు కొట్టే ప్రాంతాన్ని పరిశీలించిన ఈవో, అక్కడ భక్తుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. అనంతరం ఆలయ మైక్ ద్వారా ప్రత్యేక ప్రకటన చేయిస్తూ, టెంకాయలు కొట్టేందుకు లేదా ఇతర సేవల పేరుతో ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే అక్కడ విధుల్లో ఉన్న అధికారులకు లేదా దేవస్థానం కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని భక్తులకు సూచించారు. అలాగే కోడె మొక్కులు చెల్లించే భక్తులకు టెండర్‌దారులు విక్రయిస్తున్న పచ్చిగడ్డి, అరటిపండ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. వాటి నాణ్యతను నిర్ధారించేందుకు అక్కడే పరిశీలించి, భక్తులకు నాణ్యమైన వస్తువులే అందించాలని సంబంధిత టెండర్‌దారులకు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి దీపారాధన చేసే ప్రాంతాన్ని సందర్శించిన ఈవో, భక్తులు వెలిగించే దీపాల కోసం సహజమైన నెయ్యిని మాత్రమే వినియోగించేలా చూడాలని, ప్లాస్టిక్ లేదా రసాయన పదార్థాలు కలిగిన వస్తువులను ఉపయోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం క్యూలైన్లు, భక్తులు సేవల కోసం టికెట్లు పొందుతున్న విధానం, మొక్కుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులకు అందిస్తున్న సౌకర్యాలపై స్వయంగా భక్తులను అడిగి తెలుసుకుని, అవసరమైన చోట మరింత మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు పారదర్శకమైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే దేవస్థానం లక్ష్యమని, ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవో ఎల్. రమాదేవి స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ పరిశీలకులు వంశీ మోహన్, ఇతర ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హరీశ్ సినిమా డైలాగులు బ్యాన్ చేయ్: జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 12 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. హరీష్‌రావు సినిమా డైలాగులు బ్యాన్ చేయాలంటూ మండిపడ్డారు. ఆదివారం గాంధీ భవన్‌లో మాట్లాడిన జగ్గారెడ్డి.. కాంగ్రెస్ పార్టీ మాట మీద నిలబడే పార్టీ అని, బీఆర్ఎస్ తన మాటను నిలబెట్టుకోదంటూ విమర్శించారు. ' నీకు నచ్చపోతే సైకో లు అవుతారా హరీష్ రావు.. హరీష్ మాట లో పస లేదు. ఉద్యమంలో మీ మాటలు విని జనాలు బలి చేసుకున్నారు. కాళేశ్వరం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు వాస్తవం. కాళేశ్వరం విషయంలో మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ లో చర్చకు రావాలి. ఆయనకు కూడా ముట్టింది కాబట్టి ఆయన అలా మాట్లాడుతున్నారు. గతంలో కేసీఆర్‌తో కలిసి పని చేశావు కదా ఈటెల రాజేందర్. ఢిల్లీ కేంద్ర ఇరిగేషన్ మంత్రితో రాష్ట్ర నేతలకు ఒక సమావేశం ఏర్పాటు చేస్తే సమస్య ఏంటో తెలుస్తుంది కదా. మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడమే మాకు సరిపోతుంది' అని విమర్శించారు.

ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి

బీఎల్ఓలకు బీఎల్ఏలు సహకరించాలి

వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ అర్బన్, జూలై 12 (ఈవార్తలు): ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఆదివారం 13వ వార్డు కొనయిపల్లిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని స్థానిక నాయకులు మూడపెల్లి నాగరాజు, బిఎల్ఏ సాయిని అంజయ్యలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్న తీరును పరిశీలించి, ప్రజలతో మాట్లాడి వారి సందేహాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై అపోహలు, సందేహాలకు తావులేకుండా ప్రజలకు సరైన సమాచారం అందించడం ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఓటరు జాబితా నమోదు ప్రక్రియ పారదర్శకంగా, పకడ్బందీగా సాగాలంటే క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలకు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. ఇరుపక్షాల సమన్వయంతోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం సాధ్యమవుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన జాబితా రూపొందుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐఆర్‌కు సంబంధించిన సమాచారం, మార్గదర్శకాలు, అవసరమైన సహాయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే విధుల్లో ఉన్న బీఎల్వోలు వెంటనే నివృత్తి చేసి అవసరమైన సహకారం అందిస్తారని తెలిపారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని పుల్కం రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, బిఎల్ఏ సాయిని అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నక్క అనిల్

మల్యాల, జూలై 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలో మల్యాల మండలానికి ప్రాధాన్యం దక్కింది. బల్వంతాపూర్ గ్రామానికి చెందిన నక్క అనిల్ జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అనిల్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



నేటి ఈవార్తలు
COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS (with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))		
Position	B&W Rate	Colour Rate
Front Page	Rs.550	Rs.1,000
Page 3 / Back Page	Rs.350	Rs.750
Inside Pages	Rs.250	Rs.500

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com

లవ్లీ చిత్రం

రెండ్రోజుల్లో 37.2 కోట్లు

అక్కినేని అఖిల్ లీడ్ రోల్ లో నటించిన లేటెస్ట్ మూవీ లెనిన్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ గా దూసుకుపోతోంది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఆ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. అదే జోష్ రెండో రోజు కూడా కొనసాగడంతో సినిమా వసూళ్లు మరింత పెరిగాయి. రెండు రోజుల కలెక్షన్లను మూవీ నిర్మాణ సంస్థలు అధికారికంగా అనౌన్స్ చేశాయి. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం, లెనిన్ మూవీ రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ టాక్, మౌత్ పబ్లిసిటీ సినిమాకు పెద్ద బలంగా మారిందని మేకర్స్ తెలిపారు. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ రేంజ్ వసూళ్లు రావడం మూవీ టీమ్ లో ఉత్సాహాన్ని నింపిందనే చెప్పాలి. శుక్రవారం విడుదలైన ఆ సినిమా తొలి రోజే మంచి ఓపెనింగ్స్ నమోదు చేసింది. ఆ తర్వాత శనివారం వీకెండ్ కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ తో యూత్ కూడా థియేటర్లకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఈవెనింగ్, నైట్ షోలకు సూపర్ రెస్పాన్స్ కనిపించడంతో ఆక్యుపెన్సీ శాతం కూడా పెరిగినట్లు ట్రేడ్ పండితులు చెబుతున్నారు. అందుకే ఫస్ట్ డే కన్నా రెండు రోజు పెరిగాయని అంటున్నారు. అఖిల్ కెరీర్ లో లెనిన్ సినిమాకు స్పెషల్ ఇంపార్టెన్స్ ఉంది. గత చిత్రాల రిజల్ట్ తర్వాత సరైన విజయాన్ని అందుకోవాలన్న టార్గెట్ తో ఆయన ఆ ప్రాజెక్ట్ ను చిన్న గ్యాప్ తర్వాత సెలెక్ట్ చేసుకున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ తో రూపొందిన కథ, మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్ మిక్స్ చేసిన స్క్రీన్ ప్లే ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ ఎక్స్పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. సినిమాలో అఖిల్ యాక్టింగ్ కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. యాక్షన్ తో పాటు ఎమోషనల్ సీన్స్ లో కూడా ఆయన తన పాత్రను సరైన విధంగా డీల్ చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హీరోనే భాగ్యశ్రీ బోర్సే తన పాత్రకు న్యాయం చేయగా, ఇతర క్యాస్టింగ్ కూడా కథకు బలం చేకూర్చారని ప్రేక్షకులు చెబుతున్నారు. సినిమాలోని ఇంటర్వెల్ ఎపిసోడ్, క్లైమాక్స్ తో పాటు జూనియర్ ఎన్టీఆర్ అందించిన వాయిస్ ఓవర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆ అంశాలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయని చెప్పాలి. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు కథను కమర్షియల్ అంశాలతో మిక్స్ చేసి తెరకెక్కించిన తీరు సినిమాకు ప్లస్ గా మారిందని సినీ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన యాక్షన్ సన్నివేశాలు, కథలోని ట్విస్టులు ప్రేక్షకులను థియేటర్లలో అలరిస్తున్నాయని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

'శ్రీనివాస మంగాపురం' ట్రైలర్ రిలీజ్

ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో వారసుడు టాలీవుడ్ ఎంట్రీకి గ్రాండ్‌గా రెడీ అయిపోయాడు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న రమేష్ బాబు కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న లేటెస్ట్ మూవీ 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. పక్కా లవ్, యాక్షన్, ఎమోషనల్ ప్యాకేజీలా ఉన్న ఈ ట్రైలర్ సోషల్

మీడియాలో విపరీతమైన వ్యూస్‌తో దూసుకుపోతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అదిరిపోయిన జయ కృష్ణ స్క్రీన్ ప్రెజెన్స్: తొలి సినిమాతోనే జై కృష్ణ ఘట్టమనేని తన లుక్స్, యాక్టింగ్‌తో అందరినీ షాక్ గురిచేశాడు. ఘట్టమనేని వారసుడిగా మంచి కటౌట్‌తో స్క్రీన్ మీద చాలా కాన్ఫిడెంట్‌గా కనిపించాడు. ముఖ్యంగా లవ్ సీన్స్‌లో క్యూట్‌గా నటిస్తూనే.. యాక్షన్ సీక్వెన్స్‌లలో పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో అదరగొట్టాడు. ఇక డెబ్యూ హీరోలా కాకుండా ఎంతో అనుభవం ఉన్న నటుడిలా బాడీ లాంగ్వేజ్ మెయింటైన్ చేయడం చూసి టాలీవుడ్ వర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి.

ఐటం సాంగ్ సినిమా డీఎన్ఏలో భాగం: మమతా శర్మ

–ఐటమ్ సాంగ్స్–కున్న ప్రాముఖ్యత గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడంటే కంటెంట్ మోజులో పడి ఐటం పాటల్ని లైట్ తీసుకుంటున్నారు గానీ నాలుగైదేళ్ల క్రితం వరకూ ఐటం పాటలకు ఎలాంటి డిమాండ్ కనిపించిందో చెప్పాల్సిన పనిలేదు. అయితే వీటిపై అదే స్థాయిలో భిన్నమైన అభిప్రాయాలు కూడా లేకపోలేదు. ప్రత్యేకంగా బాలీవుడ్ పరిశ్రమలో ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తమవుతుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ గాయని మమతా శర్మ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఐటం పాటలు మన సినిమా డీఎన్ఏలో అంతర్భాగంగా పేర్కొన్నారు. కాలంతో పాటు సంగీతం, నృత్యం మారుతున్నప్పటికీ కమర్షియల్ సినిమాల్లో ఎనర్జిటిక్ పాట ఉండాలనే కాన్సెప్ట్ మాత్రం అలాగే ఉందన్నారు. ఈ తరహా పాటలు ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే కాకుండా సినిమాకు ప్రత్యేకమైన హైప్‌ను క్రియేట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. చాలా మంది ఐటం పాటలను గ్లామర్ అంశంగా చూస్తారని కానీ ఒక పాట హిట్ అవ్వాలంటే దాని వెనుక ఎంతో కష్టం ఉంటుందన్నారు. ట్యూన్, సాహిత్యం, గాత్రం అన్నీ కలిస్తేనే ఆ పాట తెరపై మ్యాజిక్‌ను సృష్టిస్తుందన్నారు. కేవలం గ్లామర్ మాత్రమే సినిమాను నిలబెట్టలేదన్నారు. ఐటమ్ సాంగ్స్ పట్ల ఉండే నెగటివిటీని పక్కనపెడితే అవి అందించే వినోద విలువను ఎవరూ కాదనలేరని ఉద్ఘాటించారు. ఒక ఐటమ్ సాంగ్ సినిమా ఫ్లోను ఎలా మారుస్తుందో? గమనించాలని మమతా శర్మ సూచించారు. కథలో కీలక మలుపు దగ్గర ... ప్రేక్షకులు థియేటర్లో బోర్ ఫీలవుతున్న సమయంలో ఇలాంటి ఎనర్జిటిక్ పాటలు కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని అభిప్రాయపడ్డారు. మ్యూజికల్ ఫీస్ట్ లాంటి ఈ పాటలు బాక్సాఫీస్ వద్ద సినిమా కలెక్షన్లను ప్రభావితం చేయడంలోనూ ..యూత్‌ను థియేటర్లకు ఆకర్షించడంలోనూ తమవంతు పాత్రను పోషిస్తాయని తెలిపారు.

చరిత్ర సృష్టించిన సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత, క్రేజీ డైరెక్టర్ నందిని రెడ్డి కాంబినేషన్‌లో వచ్చిన లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. రిలీజై 24 రోజులు దాటినా ఈ సినిమా కలెక్షన్ల హవా అస్సలు తగ్గడం లేదు. తాజాగా మూవీ బాక్సాఫీస్ వద్ద రూ. 100 కోట్ల మైలురాయిని దాటేసి సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. టాలీవుడ్ చరిత్రలోనే ఒక ఫీమేల్ సెంట్రిక్ సినిమా ఈ రేంజ్ వసూళ్లు రాబట్టడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఇప్పటివరకు వంద కోట్ల మార్క్‌ను ఎక్కువగా హీరోల సినిమాలే దాటాయి.కానీ ఒక హీరోయిన్ మెయిన్ లీడ్‌గా వచ్చిన సినిమా రూ. 100 కోట్ల గ్రాస్ వసూలు చేయడం టాలీవుడ్ చరిత్రలోనే అరుదైన రికార్డ్. ఇక ఈ భారీ సక్సెస్‌తో సమంత తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో దేశవ్యాప్తంగా మరోసారి నిరూపించింది. భవిష్యత్తులో రాబోయే లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు 'మా ఇంటి బంగారం' ఒక బెంచ్‌మార్క్‌గా నిలిచిపోనుంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఓ బేబీ' సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో మనకు తెలిసిందే. ఇప్పుడు 'మా ఇంటి బంగారం' చిత్రంతో ఈ సక్సెస్ ఫుల్ కాంబినేషన్ మరోసారి మ్యాజిక్ రిపీట్ చేసింది. ఇక నందిని రెడ్డి మార్క్ ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామా ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యాయి. థియేటర్లలో ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతుండటంతో 24వ రోజు కూడా కలెక్షన్ల వర్షం కురుస్తోంది. ఈ సినిమాకు మరో స్పెషల్ ఏమిటంటే.. సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించింది. ప్రొడ్యూసర్‌గా మారిన మొదటి సినిమాతోనే వంద కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టడం సమంత కెరీర్‌లో ఒక మైండ్‌బ్లోయింగ్ అచీవ్‌మెంట్ అని చెప్పాలి.



రూ.కోట్లు కొల్లగొడుతున్న దీపిక పదుకొనే

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే కేవలం వెండితెర కథానాయికగానే కాదు.. డిజిటల్ ప్రపంచంలోనూ తన సత్తా చాటుతోంది. ఇన్ స్టా, ఎక్స్ వంటి వేదికలపై ఎంతో యాక్టివ్ గా ఉండే దీపిక ఎంటర్ ప్రెన్యూర్ గాను రాణిస్తోంది. అదే సమయంలో ప్రముఖ కార్పొరేట్ బ్రాండ్లు అయిన నైకా, హిల్టన్, మెటా ఏఐ వంటి ప్రపంచ ప్రసిద్ధ ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ సోషల్ మీడియా వేదికగా భారీగా ప్రమోషన్స్ చేస్తోంది. తన గ్లామర్, క్రేజ్‌తో టాప్ బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ.. ప్రస్తుతం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సింగ్ రంగంలో అత్యధిక ఆదాయం ఆర్జించే అగ్రశ్రేణి భారతీయ సెలబ్రిటీలలో ఒకరిగా నిలిచింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఏదైనా ఒక బ్రాండ్‌ను ప్రమోట్ చేయడానికి లేదా ఒక స్పాన్సర్డ్ పోస్ట్ పెట్టడానికి దీపికా పదుకొనే దాదాపు 1.5 కోట్ల నుండి 2 కోట్ల వరకు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఒకవేళ సదరు బ్రాండ్ మరింత విస్తృతంగా ప్రచారం కావాలని కోరుకుంటే ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో కలిపి జాయింట్‌గా పోస్ట్ చేయడానికి దీపిక ఏకంగా 2.5 కోట్ల నుండి 3 కోట్ల వరకు డిమాండ్ చేస్తోంది. దీపికకు ఉన్న మిలియన్ల ఫాలోయింగ్ కారణంగా బ్రాండ్లు కూడా ఈ స్థాయి రెమ్యూనరేషన్ ఇవ్వడానికి వెనకాడటం లేదు.



తిట్టిపోస్తున్నారు!

ఒక సినిమాకు ముందో హీరోయిన్ని అనుకుని తర్వాత ఇంకో కథానాయికను తీసుకోవడం ఫిలిం ఇండస్ట్రీలో కొత్తేమీ కాదు. ఆ పాత్ర క్లిక్ అయితే, ఆ సినిమా బాగా ఆడితే ముందు అవకాశాన్ని వదులుకున్న హీరోయిన్ అన్ లక్కీ అనుకుంటారు. అంతకుమించి పెద్దగా డిస్కషన్ ఉండదు. కానీ ఇలా ఛాన్స్ మిస్సయిన హీరోయిన్ని అదే పనిగా టార్గెట్ చేస్తూ నెగెటివ్ కామెంట్లు చేస్తుండడమే విడ్డూరం. 'లెనిన్' సినిమాకు ముందు కథానాయికగా ఎంపికై, తర్వాత ఏవో కారణాలతో తప్పుకున్న శ్రీలీల గురించి ఇలాంటి డిస్కషనే నడుస్తోంది సోషల్ మీడియాలో. శ్రీలీల స్థానంలోకి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే ఈ అవకాశాన్ని గొప్పగా ఉపయోగించుకుంది. ప్రోమోల్లోనే అందరి దృష్టినీ ఆకర్షించిన భాగ్యశ్రీ.. సినిమాలోనూ ఆకట్టుకుంది. పాటల్లో అందచందలు, డ్యాన్సులతో అదరగొట్టిన భాగ్యశ్రీ.. నటనలోనూ మెప్పించింది. ఓవరాల్‌గా తన పెర్ఫామెన్స్‌కు మంచి స్పందన వస్తోంది. ఇప్పటిదాకా ఒక్క హిట్టూ కొట్టని భాగ్యశ్రీకి 'లెనిన్' ఒక మోస్తరు విజయాన్నందించేలా కనిపిస్తోంది. ఐతే 'లెనిన్' చూసిన వాళ్లు భాగ్యశ్రీని కొనియాడడం వరకు పరిమితం అయితే పర్వాలేదు. కానీ ఇదే సమయంలో శ్రీలీలను టార్గెట్ చేస్తున్నారు. ఆమె భారతి పాత్రను చేసి ఉంటే అది పాడైపోయేదని.. భాగ్యశ్రీలా ఆ పాత్రను పండించేది కాదని.. కీలక సన్నివేశాల్లో తేలిపోయేదని కామెంట్లు చేస్తున్నారు. శ్రీలీలను తప్పించి మంచి పని చేశారంటూ కౌంటర్లు వేస్తున్నారు. ఐతే శ్రీలీల ఎంత కమిటెడ్ యాక్ట్రెస్, ఎంత ప్రొఫెషనల్‌గా, ఉంటుంది, ఎంత అణకువతో వ్యవహరిస్తుంది అన్నది అందరికీ తెలుసు. ఎప్పుడూ యాటిట్యూడ్ చూపించింది .

లార్డ్స్ యస్తికా
భాటియా చరిత్ర

టెస్ట్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్

భారత మహిళా వికెట్ కీపర్-బ్యాటర్ యస్తికా భాటియా చరిత్ర సృష్టించింది. ప్రఖ్యాత లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో టెస్ట్ సెంచరీ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా ఆమె సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజైన ఆదివారం యస్తికా ఈ అరుదైన ఘనతను అందుకుంది. ఇంగ్లండ్ తో ఏకైక టెస్టులో లంచ్ విరామానికి 91 పరుగులతో క్రీజులో ఉన్న యస్తికా, తిరిగి ఆట మొదలయ్యాక ఏమాత్రం ఒత్తిడికి గురికాలేదు. ఇంగ్లండ్ పేసర్ ఇస్సీ వాంగ్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాది, ఆపై కవర్స్ దిశగా సింగిల్ తీసి తన తొలి అంతర్జాతీయ శతకాన్ని పూర్తి చేసుకుంది. 145 బంతుల్లో 12 ఫోర్ల సహాయంతో ఆమె ఈ సెంచరీని నమోదు చేసింది. సెంచరీ పూర్తికాగానే యస్తికా భావోద్వేగంతో మైదానంలో మోకాళ్లపై కూర్చొని పిచ్‌ను ముద్దాడింది. స్టేడియంలోని ప్రేక్షకులంతా లేచి నిలబడి చప్పట్లతో ఆమెను అభినందించారు. కెరీర్‌ను ప్రమాదంలో పడేసిన మోకాలి (ఏసీఎల్) గాయం నుంచి కోలుకొని ఈ ఇంగ్లండ్ పర్యటనతోనే యస్తికా అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసింది. ఈ చారిత్రక ఇన్నింగ్స్‌తో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకుంది. ఆట ప్రారంభమైన తొలి బంతికే లారెన్ బెల్ వేసిన బంతి వికెట్లను తాకినా బెయిల్స్ కింద పడకపోవడంతో యస్తికా అదృష్టవశాత్తు బతికిపోయింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. ఇదే మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇప్పటికే లార్డ్స్ ఆనర్స్ బోర్డుపై చోటు సంపాదించిన తన సహచర క్రీడాకారిణి క్రాంతి గౌడ్ సరసన యస్తికా కూడా చేరింది.

గంభీర్ బృందంపై వేటు?



టీ20 ప్రపంచ ఛాంపియన్ టీమిండియా వరుస ఓటములతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లలో ఘోర పరాజయాలు ఎదురుకావడంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సహాయక సిబ్బంది భవిష్యత్తు సందిగ్ధంలో పడింది. మంగళవారం నుంచి ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ తర్వాత కోచింగ్ బృందంలో మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. గత నెల ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌ను 0-2తో కోల్పోయిన భారత్, శనివారంతో ముగిసిన ఇంగ్లండ్ సిరీస్‌ను ఏకంగా 0-4తో చేజార్చుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో, 2024లో గంభీర్ ఎంపిక చేసుకున్న అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డెస్కాటే, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తమ పదవుల నుంచి తప్పుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. సుదీర్ఘ ప్రయాణాల పట్ల టెన్ డెస్కాటే ఆందోళన వ్యక్తం చేస్తుండగా, మరోవైపు ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, మోర్కెల్ తన భవిష్యత్తుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. వీరిద్దరితో బీసీసీఐ చర్చలు జరుపుతోంది. వీరితో పాటు, ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ పదవి కూడా ప్రమాదంలో పడింది. ఇటీవలి కాలంలో జట్టు ఫీల్డింగ్ ప్రమాణాలు పడిపోవడంపై బీసీసీఐ అసంతృప్తితో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో సహా ఈ కోచింగ్ బృందం బీసీసీఐతో 2o1 సంవత్సరాల ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఓటముల నేపథ్యంలో హెడ్ కోచ్ గంభీర్ (2027 వన్డే ప్రపంచకప్ వరకు కాంట్రాక్ట్) పదవిపై కూడా మీడియాలో చర్చ జరుగుతున్నప్పటికీ, ప్రస్తుతానికి మార్పులన్నీ సహాయక సిబ్బందికే పరిమితం అయ్యేలా కనిపిస్తున్నాయి.

సెమీఫైనల్‌కు
అర్జెంటీనా

హోరాహోరీ పోరులో స్విస్ చిత్తు

ఇంగ్లండ్‌తో తలపడనున్న డిఫెండింగ్ ఛాంపియన్

ఫిఫా వరల్డ్ కప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్‌పై అదనపు సమయంలో 3-1 తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో అట్లాంటాలో జరగనున్న సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి ఇంగ్లండ్‌తో తలపడేందుకు అర్హత సాధించింది.

కాన్సాస్ సిటీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే అర్జెంటీనా ఆధిపత్యం ప్రదర్శించింది. ఆట 10వ నిమిషంలో కెప్టెన్ లియోనెల్ మెస్సీ అందించిన అద్భుతమైన క్రాస్‌ను అలెక్సిస్ మాక్ అలిస్టర్ హెడర్‌తో గోల్‌గా మలిచి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, స్విట్జర్లాండ్ అంత సులభంగా లొంగలేదు.

67వ నిమిషంలో డాన్ ఎండోయె గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. మ్యాచ్ 72వ నిమిషంలో కీలక మలుపు తిరిగింది. డైవ్ చేసినందుకు వీడియో అసిస్టెంట్ రిఫరీ (వీఏఆర్) సమీక్ష తర్వాత స్విస్ ఆటగాడు బ్రీల్ ఎంబోలోకు రెండవ ఎల్లో కార్డ్ చూపడంతో రిఫరీ అతడిని మైదానం నుంచి పంపించేశారు. దీంతో స్విట్జర్లాండ్ 10 మంది ఆటగాళ్లతోనే పోరాడాల్సి వచ్చింది. నిర్ణీత సమయంలో మరో గోల్ నమోదు కాకపోవడంతో మ్యాచ్ అదనపు సమయానికి దారి తీసింది. అదనపు సమయంలో అర్జెంటీనా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఆట 112వ నిమిషంలో జూలియన్ అల్వారెజ్ 25 గజాల దూరం నుంచి కొట్టిన శక్తివంతమైన షాట్ నేరుగా గోల్ పోస్టులోకి దూసుకెళ్లడంతో అర్జెంటీనా 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఇంజ్యూరీ టైమ్‌లో లౌటారో మార్టినెజ్ మరో గోల్ చేసి 3-1తో అర్జెంటీనా విజయాన్ని ఖాయం చేశాడు. ఈ ఓటమితో 1954 తర్వాత తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన స్విట్జర్లాండ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ వరల్డ్ కప్‌లో అర్జెంటీనా ప్రయాణం అంత సులభంగా సాగలేదు. రౌండ్ ఆఫ్ 16లో కేప్ వెర్డేపై, ఆ తర్వాత ఈజిప్టుపై కూడా కఠిన పోరాటంతోనే నెగ్గింది. మరోవైపు నార్వేను అదనపు సమయంలో ఓడించి ఇంగ్లండ్ సెమీస్‌కు చేరుకుంది. దీంతో జులై 15న అర్జెంటీనా, ఇంగ్లండ్ మధ్య జరగనున్న సెమీ ఫైనల్ పోరుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరో సెమీ ఫైనల్‌లో స్పెయిన్, ఫ్రాన్స్ జట్లు తలపడనున్నాయి.

టీమిండియాకు డబుల్ షాక్

వన్డేలకు భారత జట్టులో మార్పులు

ఇంగ్లాండ్ పర్యటన సందర్భంగా భారత జట్టులో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇంగ్లాండ్‌తో జరగనున్న 3 వన్డేల సిరీస్, జింబాబ్వేతో జరగనున్న 3 టీ20ల సిరీస్‌ల కోసం భారత జట్టులో కీలక మార్పులను బీసీసీఐ ప్రకటించింది. వాస్తవానికి ఇంగ్లాండ్ జట్టుతో వన్డే సిరీస్‌కు ముందు భారత్‌కు రెండు పెద్ద ఎదురుదెబ్బలు తగిలాయి. జట్టు స్టార్ పేసర్ హర్షిత్ రాణా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయాల కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యారు. వారి స్థానంలో ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్‌లకు జట్టులో చోటు దక్కింది. ట్రెంట్ బ్రిడ్జ్ మైదానంలో ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన మూడో టీ20 సందర్భంగా హర్షిత్ రాణా తన కుడి తొడ కండరంలో అకస్మాత్తుగా నొప్పిని అనుభవించాడని.. స్కానింగ్‌లో గ్రేడ్ 1 హ్యామ్‌స్ట్రింగ్ గాయం నిర్ధారణ అయిందని నేడు(జులై 12) బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. ఈ గాయం కారణంగా ఇంగ్లాండ్‌తో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కు హర్షిత్ రాణా దూరమయ్యాడు. తదుపరి వైద్య పరీక్షలు, పునరావాసం కోసం హర్షిత్ రాణా ఇప్పుడు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)కి హాజరుకానున్నాడు. ఈ పరిస్థితిలో, హర్షిత్ స్థానంలో యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను భారత వన్డే జట్టులోకి తీసుకున్నారు. ప్రిన్స్ యాదవ్ ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసి, అక్కడ రెండు మ్యాచ్‌లలో మూడు వికెట్లు పడగొట్టాడు. అయితే హర్షిత్ స్థానంలో అనుభవజ్ఞుడైన ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడంతో సెలెక్టర్లు అందరినీ ఆశ్చర్యపరిచారు. న్యూజిలాండ్ సిరీస్ నుంచి సిరాజ్ భారత వన్డే జట్టుకు దూరంగా ఉన్నాడు. అదే మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా ఎడమ కాలి తొడ కండరాల గాయానికి గురయ్యాడు. ఎంఆర్ఐ స్కాన్‌లో అది గ్రేడ్ 2 తొడ కండరాల గాయంగా తేలింది. వైద్య సలహా మేరకు జింబాబ్వేతో జరగబోయే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు వరుణ్ చక్రవర్తిని దూరం పెట్టారు. వరుణ్ చక్రవర్తి కూడా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)కు హాజరవుతాడు, అక్కడ వరుణ్ చక్రవర్తి కోలుకునేవరకు పర్యవేక్షిస్తారు. ఫలితంగా అతని స్థానంలో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను భారత టీ20 జట్టులోకి తీసుకున్నారు. ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో కూడా రవి బిష్ణోయ్ భారత జట్టులో భాగంగా ఉన్నాడు.

మర్యాదగా మాట్లాడు
రిఫరీపై మెస్సీ ఫైర్

2026 ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనా, స్విట్జర్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్ కేవలం ఆటకే పరిమితం కాలేదు, మైదానంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ముఖ్యంగా అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, మ్యాచ్ రిఫరీ జోవాో పిన్హీరో మధ్య జరిగిన వాగ్వాదం ఫుట్‌బాల్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. అదనపు సమయంలో అర్జెంటీనా విజయం సాధించినప్పటికీ, మెస్సీ ప్రదర్శించిన ఆగ్రహం ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. మ్యాచ్ మొదటి అర్ధభాగంలో స్విట్జర్లాండ్‌కు ఫ్రీ కిక్ లభించినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. అర్జెంటీనా నిర్మించిన డిఫెన్సివ్ వాల్‌లో భాగంగా ఉన్న మెస్సీని, నిబంధనల ప్రకారం నిర్దేశిత దూరం వెనక్కి జరగాలని రిఫరీ పిన్హీరో సూచించారు. అయితే, రిఫరీ మాట్లాడిన తీరుతో తీవ్ర ఆగ్రహానికి గురైన మెస్సీ వెంటనే స్పందించాడు. "నాతో మర్యాదగా మాట్లాడు. నన్ను అగౌరవపరచకు. నేను నీతో సరిగ్గానే మాట్లాడాను" అంటూ రిఫరీకి గట్టిగా బదులిచ్చాడు. ఈ టోర్నమెంట్‌లో తొలిసారి గోల్ చేయడంలో విఫలమైన మెస్సీ, మ్యాచ్ ఆసాంతం తీవ్ర నిరాశతో కనిపించాడు. స్విస్ జట్టు పటిష్ఠమైన డిఫెన్స్‌తో మెస్సీని సమర్థంగా కట్టడి చేయడంతో అతనిలో అసహనం మరింత పెరిగింది. నిర్ణీత 90 నిమిషాల ఆట ముగిసేసరికి స్కోరు 1-1తో సమంగా నిలవడంతో ఒత్తిడి తారస్థాయికి చేరింది. ఇదే మ్యాచ్‌లో రిఫరీ పిన్హీరో తీసుకున్న మరో నిర్ణయం కూడా వివాదాస్పదమైంది. వీఏఆర్ సమీక్ష తర్వాత డైవింగ్ చేసినందుకు స్విట్జర్లాండ్ ఆటగాడు బ్రీల్ ఎంబోలోకు రెడ్ కార్డ్ చూపించి మైదానం నుంచి పంపించేశారు. దీంతో స్విస్ జట్టు 10 మందితోనే ఆడాల్సి వచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అర్జెంటీనా, అదనపు సమయంలో వేగంగా రెండు గోల్స్ చేసి విజయాన్ని అందుకుంది.

ఈవార్తలు
ప్రజావాణి
సోమవారం 13-7-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

గంగమ్మను విడిస్తేనే రైతన్నకు బతుకు

కాళేశ్వరం ప్రాజెక్టు గురించి రాజకీయ వేదికలపై ఎంతటి విమర్శలు, ఆరోపణలు వినిపించినా ఒక వాస్తవాన్ని మాత్రం విస్మరించలేం. తెలంగాణలోని లక్షలాది మంది రైతుల జీవన విధానాన్ని మార్చిన ప్రధాన సాగునీటి వనరుగా కాళేశ్వరం నిలిచింది. ఈ ప్రాజెక్టు లేకపోతే ఉత్తర తెలంగాణతో పాటు మధ్య తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడేది. నేడు ఈ ప్రాజెక్టుపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా అంశాలపై చర్చలు జరుగుతున్నా, రైతుకు నీరు అందించే దాని ప్రాధాన్యాన్ని తగ్గించి చూడలేం. తెలంగాణ ఏర్పడక ముందు ఎన్నో ప్రాంతాలు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడేవి. వర్షాలు పడితే పంట, లేకపోతే అప్పులు, వలసలే రైతు జీవితంగా మారింది. బోర్లు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, వరుస కరువులు రైతును ఆర్థికంగా కుంగదీసేవి. అలాంటి పరిస్థితుల్లో గోదావరి జలాలను ఎత్తిపోసి ఎత్తైన ప్రాంతాలకు చేరవేయాలనే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. సాగునీరు అందడం వల్ల అనేక జిల్లాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. చెరువులు నిండాయి. భూగర్భ జలాల మట్టాలు మెరుగుపడ్డాయని అనేక ప్రాంతాల రైతుల అనుభవాలు చెబుతున్నాయి. వ్యవసాయం కేవలం ఒక వృత్తి కాదు; తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతు పంట పండిస్తేనే వ్యవసాయ కూలీకి పని ఉంటుంది. ఎరువుల దుకాణాలు, విత్తన వ్యాపారులు, రవాణా, మార్కెట్ యార్డులు, రైస్ మిల్లులు, వ్యవసాయ యంత్రాల రంగం అన్నీ చైతన్యంగా ఉంటాయి. కాళేశ్వరం ద్వారా నీటి లభ్యత పెరగడం వల్ల ఈ మొత్తం ఆర్థిక గొలుసు బలోపేతమైంది. అందువల్ల ఈ ప్రాజెక్టు ప్రభావం కేవలం రైతుకే పరిమితం కాదు; గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తంపైనా ఉంటుంది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ లోపాలు, నిర్వహణ సమస్యలు, ఖర్చుల పెరుగుదల, కొన్ని బ్యారేజీల్లో తలెత్తిన సాంకేతిక ఇబ్బందులు వంటి అంశాలను విస్మరించలేం. ప్రజాధనం వెచ్చించిన ప్రతి ప్రాజెక్టుపై జవాబుదారీతనం తప్పనిసరి. లోపాలు ఎక్కడ జరిగాయో నిష్పాక్షికంగా గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అవసరమైన మరమ్మతులు, సాంకేతిక బలోపేతం, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి రాజీ ఉండకూడదు. లోపాలను సరిదిద్దడం ఒక విషయం; మొత్తం ప్రాజెక్టు అవసరాన్నే ప్రశ్నించడం మరో విషయం. ఈ రెండింటిని కలగలపడం సరైంది కాదు. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం అనిశ్చితంగా మారుతున్న ఈ కాలంలో పెద్ద సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యం మరింత పెరిగింది. తెలంగాణ భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే గోదావరి జలాలను సమర్థంగా వినియోగించడం రాష్ట్ర భవిష్యత్తుకు అత్యవసరం. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులను శాస్త్రీయంగా నిర్వహిస్తూ, వాటి సామర్థ్యాన్ని పెంచడం ప్రభుత్వాల బాధ్యత. అదే సమయంలో నీటి వృథాను తగ్గించడం, పంటల వైవిధ్యీకరణ, సూక్ష్మ సాగునీటి పద్ధతులను ప్రోత్సహించడం కూడా సమాంతరంగా సాగాలి. రాజకీయాలు మారవచ్చు. ప్రభుత్వాలు మారవచ్చు. కానీ రైతు అవసరాలు మారవు. తెలంగాణ రైతు భవిష్యత్తు నీటితో ముడిపడి ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలుంటే వాటిని సరిచేయాలి; అవినీతి జరిగితే విచారించాలి; బాధ్యులను శిక్షించాలి. కానీ రైతుకు జీవనాధారంగా నిలిచిన సాగునీటి వ్యవస్థను బలహీనపరిచే విధంగా నిర్ణయాలు తీసుకోవడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధం. రైతు పొలం పచ్చగా ఉంటేనే తెలంగాణ పల్లె పచ్చగా ఉంటుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం అనేది అధికారాన్ని ప్రదర్శించే యంత్రాంగం కాదు; ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను స్వీకరించిన సంస్థ. ప్రజలు తమ ఓటు ద్వారా ప్రభుత్వానికి అధికారాన్ని అప్పగిస్తారు. ఆ అధికారానికి సమానంగా జవాబుదారీతనం కూడా ఉండాలి. అధికారాలు పెరిగి బాధ్యతలు తగ్గిపోయిన చోట ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. అందుకే మంచి పాలనకు తొలి అర్హత జవాబుదారీతనం. ఇది కేవలం ఒక పరిపాలనా సూత్రం మాత్రమే కాదు, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే నైతిక విలువ కూడా. జవాబుదారీతనం అంటే కేవలం తప్పు జరిగినప్పుడు సమాధానం చెప్పడం మాత్రమే కాదు. తీసుకున్న ప్రతి నిర్ణయానికి కారణం చెప్పగలగడం, ప్రజల డబ్బును ఎలా వినియోగించామో వివరించడం, ఇచ్చిన హామీల అమలుపై నివేదిక ఇవ్వడం, తప్పులు జరిగితే వాటిని అంగీకరించి సరిదిద్దడం కూడా జవాబుదారీతనంలో భాగమే.

జవాబుదారీతనంతోనే మంచి పాలన

అధికారంలో ఉన్నవారు ప్రజలకు సేవకులమనే భావనతో పనిచేసినప్పుడే పాలనలో నాణ్యత పెరుగుతుంది. అధికారాన్ని హక్కుగా కాకుండా బాధ్యతగా భావించినప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కారాలు కనిపిస్తాయి. దేశంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. వేల కోట్ల రూపాయలు అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చవుతున్నాయి. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు ప్రతిచోటా కనిపించకపోవడానికి ప్రధాన కారణాల్లో జవాబుదారీతనం లోపం కూడా ఒకటి. ప్రాజెక్టులు ఆలస్యం కావడం, వ్యయాలు విపరీతంగా పెరగడం, పనుల నాణ్యత తగ్గిపోవడం, ప్రజా ధనం వృథా కావడం వంటి సమస్యలు బాధ్యతాయుత పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఎక్కువగా చోటుచేసుకుంటాయి. ప్రభుత్వ కార్యాలయంలో ఒక సాధారణ పౌరుడు తన పని చేయించుకోవడానికి రోజులు తిరగాల్సి రావడం కూడా ఇదే సమస్యకు నిదర్శనం. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఐదేళ్లకోసారి జరిగే ఒక ప్రక్రియ మాత్రమే. ప్రజలకు జవాబుదారీతనం మాత్రం ప్రతి రోజూ ఉండాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగిందో ప్రజలకు తెలియజేయడం ప్రభుత్వాల బాధ్యత. ఎన్నికల ప్రణాళికలు కేవలం ప్రచార పత్రాలుగా మిగిలిపోకుండా వాటి పురోగతిపై నిరంతర సమీక్ష జరగాలి. ప్రజలు అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉండాలి. అదే ప్రజాస్వామ్య స్ఫూర్తి.

పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం రెండూ ఒకదానికొకటి విడదీయరాని అంశాలు. సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంటేనే ప్రభుత్వ పనితీరుపై సమీక్ష సాధ్యమవుతుంది. సమాచార హక్కు చట్టం ఈ దిశగా ఒక కీలక అడుగు. అయితే చట్టం ఉండటమే సరిపోదు. ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సమాచారాన్ని ప్రజలకు అందించే సంస్కృతి పెరగాలి. బడ్జెట్ కేటాయింపులు, టెండర్లు, పనుల పురోగతి, ఖర్చుల వివరాలు, సేవల ప్రమాణాలు ప్రజల ముందుంచినప్పుడే విశ్వాసం పెరుగుతుంది. జవాబుదారీతనం రాజకీయ నాయకులకు మాత్రమే పరిమితం కాదు. పరిపాలనా వ్యవస్థలో ప్రతి ఉద్యోగి తన బాధ్యతను గుర్తించాలి. ఒక ఫైల్ ఆలస్యం కావడం వెనుక ఒక రైతు రుణం ఉండవచ్చు, ఒక విద్యార్థి స్కాలర్‌షిప్ ఉండవచ్చు, ఒక రోగి వైద్య సహాయం ఉండవచ్చు. ప్రభుత్వ ఉద్యోగం అనేది ప్రజలకు సేవ చేయడానికి ఇచ్చిన అవకాశం. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నిర్లక్ష్యం, ఆలస్యం, అవినీతి ఏ రూపంలోనైనా అంగీకారయోగ్యం కాదు. పనితీరును కొలిచే ప్రమాణాలు, సమయపాలన, సేవల హామీ చట్టాల అమలు మరింత సమర్థవంతంగా ఉండాలి. అవినీతి జవాబుదారీతనానికి ప్రధాన శత్రువు. బాధ్యత లేకపోయిన చోట అధికార దుర్వినియోగం పెరుగుతుంది. లంచాలు, అక్రమాలు, నిధుల దుర్వినియోగం ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అవినీతిని అరికట్టడానికి కేవలం విచారణ సంస్థలు సరిపోవు. వ్యవస్థలో పారదర్శకత, డిజిటల్ సేవలు, సామాజిక ఆడిట్, స్వతంత్ర పర్యవేక్షణ, కఠిన శిక్షలు కలిసి పనిచేయాలి. తప్పు చేసిన వ్యక్తి ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నా చట్టం ముందు సమానంగా నిలబడాలి. శిక్ష తప్పదనే నమ్మకం ఏర్పడితేనే అవినీతి తగ్గుతుంది.

స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వరకు ప్రతి స్థాయిలో జవాబుదారీతనం అవసరం. గ్రామ పంచాయతీ నిర్మించిన రహదారి నాణ్యతపై ప్రశ్నించే హక్కు గ్రామస్థుడికి ఉంది. మున్సిపాలిటీ తాగునీటి సరఫరాపై నగరవాసి ప్రశ్నించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రభావాన్ని ప్రజలు తెలుసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ ప్రాజెక్టుల పురోగతిపై సమాచారం కోరవచ్చు. ఈ ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం. ప్రశ్నలను విమర్శలుగా కాకుండా ప్రజా భాగస్వామ్యంగా ప్రభుత్వం స్వీకరించాలి. న్యాయవ్యవస్థ, శాసనసభలు, మీడియా, రాజ్యాంగబద్ధ సంస్థలు కూడా జవాబుదారీతనాన్ని బలోపేతం చేసే కీలక స్తంభాలు. శాసనసభల్లో విధానాలపై లోతైన చర్చలు జరగాలి. ప్రజాధన వినియోగంపై సమీక్షలు ఉండాలి. న్యాయవ్యవస్థ రాజ్యాంగ విలువలను కాపాడాలి. మీడియా సంచలనాల కోసం కాకుండా ప్రజా ప్రయోజనాల కోసం ప్రశ్నించాలి. సమాజం కూడా బాధ్యతాయుతంగా స్పందించాలి. వాస్తవాల ఆధారంగా చర్చ జరిగితేనే ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉంటుంది. సాంకేతికత కూడా జవాబుదారీతనాన్ని పెంచే శక్తివంతమైన సాధనం. ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, ఈ-టెండరింగ్, సేవల ట్రాకింగ్, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు అవినీతిని తగ్గించడంలో సహాయపడుతున్నాయి. కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులను ప్రభుత్వ సేవల్లో వినియోగించడం ద్వారా నిర్ణయాల నాణ్యతను మెరుగుపరచవచ్చు. అయితే సాంకేతికతకు మానవ విలువలు తోడైతేనే అది ప్రజలకు ఉపయోగపడుతుంది.

ప్రజలకు కూడా బాధ్యత ఉంది. ఓటు వేసిన తర్వాత పాలనను పూర్తిగా ప్రభుత్వానికే వదిలేయడం సరైంది కాదు. ప్రజా సమస్యలపై స్పందించడం, స్థానిక సంస్థల సమావేశాల్లో పాల్గొనడం, అవినీతిని నిరసించడం, చట్టాలను గౌరవించడం, పన్నులు చెల్లించడం, ప్రజా ఆస్తులను కాపాడడం వంటి బాధ్యతలను ప్రతి పౌరుడు నిర్వర్తించాలి. బాధ్యతాయుత పౌర సమాజం ఉన్నప్పుడే బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడుతుంది. మంచి పాలన అంటే భారీ భవనాలు నిర్మించడం, పెద్ద పెద్ద ప్రాజెక్టులు చేపట్టడం మాత్రమే కాదు. సాధారణ పౌరుడు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినప్పుడు గౌరవంగా వ్యవహరించడం, సమయానికి సేవలు అందించడం, ప్రజా ధనాన్ని సమర్థంగా వినియోగించడం, తప్పులు జరిగితే వాటిని దాచిపెట్టకుండా అంగీకరించి సరిదిద్దడం.. ఇవే నిజమైన మంచి పాలనకు ప్రమాణాలు. అధికారం ప్రజల నుంచి వచ్చింది అనే సత్యాన్ని ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి అధికారి ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే జవాబుదారీతనం ఒక నినాదంగా కాకుండా పరిపాలనా సంస్కృతిగా మారాలి. ప్రభుత్వం ప్రశ్నలకు సమాధానం చెప్పాలి, అధికారులు తమ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలి, ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలి. ఈ మూడు కలిసొస్తేనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది. విశ్వాసాన్ని గెలుచుకున్న ప్రభుత్వమే చరిత్రలో నిలుస్తుంది. ఆ విశ్వాసానికి మూలం అధికార ప్రదర్శన కాదు.. జవాబుదారీతనం. అందుకే జవాబు దారీత నమే మంచి పాలనకు నిజమైన పునాది.

వెంకటేశ్ గుగ్గిళ్ల
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

ఏం తినాలన్నా భయమేస్తోంది!

రాష్ట్రంలో పట్టణాలు, గ్రామాల్లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పుట్టగొడుగుల (మష్రూమ్) వంటకాలు, చాట్ బండ్లు, రోడ్డు పక్కన ఏర్పడుతున్న తినుబండారాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తక్కువ ధర, వెంటనే అందుబాటులో ఉండటం వల్ల ప్రజలు వీటిని ఆశ్రయిస్తున్నారు. అయితే వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన వ్యవస్థ పర్యవేక్షణలో లోపాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పుట్టగొడుగులతో తయారుచేసే వంటకాలు అత్యంత పరిశుభ్రంగా నిల్వ చేసి, తాజా పదార్థాలతో తయారు చేయాలి. కానీ కొన్నిచోట్ల నాణ్యత లేని మష్రూమ్‌లు, గడువు ముగిసిన సాస్‌లు, కృత్రిమ రుచులు, కల్తీ మసాలాలు, పదేపదే వేడి చేసిన నూనె వాడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ మళ్లీ వేడి చేయడం వల్ల క్యాన్సర్‌కు దారితీసే రసాయనాలు ఉత్పత్తి అవుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోడ్ల పక్కనే ఏర్పాటు చేస్తున్న ఫుడ్ బండ్లపై దుమ్ము, ధూళి, వాహనాల పొగ నేరుగా ఆహారంపై పడుతోంది. ఆహారాన్ని కప్పి ఉంచకపోవడం, ఈగలు, దోమలు వాలడం, మురికి నీటితో పాత్రలు కడగడం, చెత్తను పక్కనే వేయడం వంటి పరిస్థితులు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. ఇలాంటి ఆహారం తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజనింగ్, విరేచనాలు, టైఫాయిడ్, జాండిస్, కడుపు సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. ఆహార భద్రత చట్టం ప్రకారం ప్రతి ఆహార విక్రయ కేంద్రం తప్పనిసరిగా ఖీూూ× లైసెన్స్ కలిగి ఉండాలి. సిబ్బంది పరిశుభ్రమైన దుస్తులు ధరించడం, గ్లౌజులు, హెడ్ క్యాప్‌లు వినియోగించడం, శుభ్రమైన తాగునీరు ఉపయోగించడం, నాణ్యమైన ముడి పదార్థాలు వాడటం, వంటశాల పరిశుభ్రంగా ఉంచడం వంటి నిబంధనలు పాటించాలి. కానీ చాలాచోట్ల ఇవి అమలులో కనిపించడం లేదు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు క్రమం తప్పకుండా జరగాలి. కల్తీ నూనెలు, గడువు ముగిసిన పదార్థాలు, నాసిరకం మసాలాలు, నాణ్యత లేని ముడి సరుకులపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలి. నిబంధనలు ఉల్లంఘించే ఫుడ్ సెంటర్లపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే లైసెన్స్ రద్దు చేసే చర్యలు తీసుకోవాలి. రోడ్ల పక్కన ఆహారం విక్రయించే బండ్లకు పరిశుభ్రత ప్రమాణాలు నిర్దేశించి, వాటి అమలును కచ్చితంగా పర్యవేక్షించాలి. ప్రజలు కూడా తక్కువ ధర చూసి ఆరోగ్యాన్ని పణంగా పెట్టకుండా పరిశుభ్రమైన ఆహార కేంద్రాలను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. అనుమానాస్పద ఆహారం, కల్తీ పదార్థాలు, అపరిశుభ్ర పరిస్థితులు కనిపిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఆహార భద్రత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; వ్యాపారుల నైతిక కర్తవ్యం, ప్రజల అప్రమత్తత కూడా అంతే ముఖ్యం. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి నాణ్యమైన ఆహారం, కఠినమైన పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన వ్యాపార విధానాలు మూడు కలిసి నడవాలి.

శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, ఫోన్ నంబర్: 9133947176.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.